శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ కీ జై!

నిత్య సత్యుడు

నిరంజనుడు

నిరతిశయ ఆనందం



నిర్హేతుక ప్రేమ

నిత్య తృప్తి

# కృప

19వ జన్మదిన సంచిక

గురువుగారు మనల్ని చూస్తుంటే, ఆ చూపులో మనపైన ప్రేమను, కరుణను ఎంత చక్కగా వ్యక్తం చేస్తున్నారు.
ఆ అనుభూతి పొందిన మనం పిలిచే పిలుపులో మన ప్రేమ, కృతజ్ఞత వ్యక్తం అవ్వాలి.



# తన్మయత్వపు తావు నుండే పేరు మరచిన ప్రేమతత్వం

## ఇన్ లవ్ వి లూస్ అవర్ సెల్వ్స్ అండ్ ఇన్‌లూసింగ్ వి గైన్

అన్నీ మరచిపోయి, ఎవరు ఏమిటి, వాళ్ళ పొజిషన్ ఏమిటి, వాళ్ళ పదవి ఏమిటి మరచిపోయి అక్కడ నామీద ఫోకస్‌తో వాళ్ళు తోసుకొని వచ్చేటప్పుడు, అది నాకు నచ్చేది. తోసుకోవడం కాదు నచ్చేది. ఆ తోసుకునే ప్రోసెస్‌లో వాళ్ళని వాళ్ళు, వాళ్ళు ఏమిటి అని మరచిపోతారు చూసారా అది. ఎన్ని జపాలు, యాగాలు చేసినా కూడా రానటువంటి స్థితి అది. అది కొద్దిక్షణమే గాక మనలని మనం మరచిపోయే స్థితి ఉంటుంది.

మనలను మనం మరచిపోయి, మనం ప్రేమించేటటువంటి ఫార్మ్ పట్ల మనకు ఉండేటటువంటి ఫోకస్, ఆ ఒక్క నిముషమే కావచ్చు, అర నిముషమే కావచ్చు. ఆ మనసుకు కలిగేటటువంటి స్థితి, అది నాకు చాలా ఇష్టమైనది.

**"అహము వదిలేయుటే సాయిపథము"** - మహా మంత్రం క్రింద పెట్టుకోండి. అహము అంటే ఏమిటి, నేనెవరు, నేను ఫలానావాడిని. ఏ ఊరి వాడిని, ఏ సామాజిక వర్గానికి చెందినవాడిని, నేను ఏ ఉద్యోగాలు చేస్తుంటాను, ఇవన్నీ కాక మీపట్ల మీకుండేటటువంటి అభిప్రాయం. అది **ఇగో** అంటే.




సంపుటి : 19
జనవరి 1

కృప

సంచిక : 1
2016




# సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

\- శ్రీబాబూజీ



## లోపలి పేజీలలో


ప్రేమిద్దాం.. ప్రేమను పంచుదాం... 5
\- గురుకృప

గురుకృపాలహరి 23
\- గురుకృప

సాధన గురించి 7
\- శరశ్చంద్రికలు

పరమగురువు ఏసు కథ 27
నావాణి

గురువు - శిష్యుడు 15
\- శరశ్చంద్రికలు

సమయం విలువ 29
\- గురుకృప



నిర్వహణ : *గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు*

**GURUKRUPA**

Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



18 సంవత్సరాలుగా తనను ప్రేమతో లాలించి, బుజ్జగించి, బోధించి
పెంచి పెద్ద చేసిన గురుదేవులకు... గురుబంధువులకు

# 'గురుకృప'

తన 19వ జన్మదిన సందర్భముగా
కృతజ్ఞతాభివందనాలను సమర్పించుచున్నది.

గురుకృప గురుదేవుల వాణిగా, బాణిగా - అన్వేషకులకు సమాధానంగా, జిజ్ఞాసులకు అవగాహనగా, ఆర్తులకు, అర్థార్తులకు ఆలంబనగా, పథగాములకు ఆదరువుగా, సాధకులకు మిత్రునిగా - అందరికీ, ఇందరికీ మార్గదర్శకంగా నిలిచింది. గురుదేవుల అనుగ్రహభాషణలు, గురుదేవులతో భక్తుల అనుభవాలు, అనుభూతులు మనందరికీ వారి స్పర్శను, సద్గురుపథంలో స్ఫూర్తిని అందిస్తూ పరిణామక్రమంలో మనందరం గురుకృపతో సద్గురుచరణ సన్నిధిని చేరాలని సవినయంగా ఆ శరశ్చంద్రుని ప్రార్థన చేస్తుంది గురుకృప.

**ప్రేమ - నమ్మకాన్నిస్తుంది. -శ్రీబాబూజీ**

# ప్రేమిద్దాం.. ప్రేమను పంచుదాం... ప్రేమగా జీవిద్దాం..



మనం బాబాను ప్రేమిస్తున్నాం అని చెప్పుకుంటున్నాం, అనుకుంటున్నాం. అలానే మన చుట్టూ ఉన్నవారిని, పరిస్థితులను, ప్రకృతిని, మానవాళిని ప్రేమిస్తున్నాం అనుకుంటున్నాం. ఏం ప్రేమిస్తున్నాం... వారిని ఆసాంతం ప్రేమిస్తున్నామా? అంటే లేదు. వారిలో మనకిష్టమైన వాటినే ప్రేమిస్తున్నామేగాని, వారిని వారిగాను, లేక వారి ఆసాంతాన్ని ప్రేమించడం లేదు మనం. ఇప్పుడు మరి మనం ప్రేమించినట్లా? మనం వారిని ప్రేమించడంలా! వాళ్ళలో మనకున్న ఇష్టాల్ని ప్రేమిస్తున్నాం - అంటే మన ఇష్టాల్నే మనం ప్రేమిస్తున్నాం. మరి వాళ్ళని ఎప్పుడు ప్రేమిస్తాం? వాళ్ళ ఇష్టాల్ని మన ఇష్టాలుగా ప్రేమించినపుడు ప్రేమించినవాళ్ళమవుతాము.

బాబాను ప్రేమిస్తున్నాం, అనుకునే మనం ఆలోచిస్తే ఆయన చెప్పినట్లు చేయం, ఆయన మాట వినం. ఆయన మాటలు పాటించం, ఆయన భావాలను గ్రహించం (బోధను గ్రహించం) ఏమిటయ్యా మనం ఆయన్నుండి స్వీకరిస్తున్నది! మన ఇష్టాలను, అయిష్టాలనే కదా.నాకిదివద్దు, (అయిష్టం), నాకది కావాలి (ఇష్టం). కష్టాల్ని తొలగించుకుంటున్నాం. కోరిక కలిగింది తీర్చమని అడుగుతున్నాం.. ఆయన తీరుస్తున్నారు. మరి ఎవరికి ప్రేమ ఉన్నట్లు? ఆయనకి మనమీద ప్రేమ ఉన్నట్లు కదా! మన కోరిక తీర్చడంలో ఆయన ఎలా తీర్చారు? ఎందుకు తీర్చారు? తీర్చడానికి ఏమి చేసారు? అన్నది గ్రహించుకునే ప్రయత్నంలో బాబా 'బోధ' బోధపడుతుంది. అలానే మనకు ఆయన అంటే ప్రేమ ఉంది అంటే ఆయన అడిగినవి మనం చేసినపుడే కదా! మరి ఇప్పుడు మనకి ప్రేమ ఉందా? ఆయన ప్రేమలో ఆశించడం లేదు కనుకనే మీకిష్టమైన మార్గంలోనే మిమ్మల్ని నడిపిస్తాను. అందుకే అన్నారు శ్రీసాయి 'జీవితంలో సౌఖ్యం చిక్కాక నన్నుసరించి గమ్యం చేరేలా చేస్తాను అని.'

"నేను బానిసను" అని బాబా చెప్పిన "అమృతవాక్కులు". ప్రేమ అంటే బానిసత్వం కాదు. ప్రేమించడం అంటే బానిసలా చూడటం కాదు. మనం ఎవరినైనా ప్రేమిస్తే వాళ్ళని బానిసలా చూస్తాం. కానీ పైకి చెప్పం. నువ్వంటే నాకిష్టం. నువ్వు లేకపోతే నేను లేను. నువ్వు కాకపోతే నాకు ఎవరు చేస్తారు అని రకరకాలుగా మాటలు చెపుతుంటాం. మొత్తానికి ఎలా వాడుకోవాలో అలా అవసరానికి చక్కగా వాడుకుంటాం. కానీ బాబా చెప్పిన ఆ వాక్కులను గమనించుకుందాం ఒక్కసారి.



బాబా అంటే ప్రేమ. బాబా మనలని ప్రేమిస్తున్నారు. అంతేకాకుండా ఆ ప్రేమానుభూతిని మనకు ఇస్తున్నారు. అంతటి ప్రేమమూర్తి మనల్ని ప్రేమిస్తూ, మనం అడిగినవి, అడగనివి ఇస్తూ మనందరికి 'అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడు'లా 'మహారాజు'లా ఉంటూ కూడా ఎంతో ఆనందంగా "నేను మీకు బానిసను" అని చెప్పారు. అదీ ప్రేమంటే. మరి మనది ప్రేమ లేక ఇష్టమా? ఆలోచించుకుందాం. మనం ఎవరినైనా ప్రేమిస్తే వాళ్లకి మనమే బానిస కావాలి. ఎవరినీ బానిసలా చూడకూడదు. ఆ సద్గురుమాయి చెంత ఉన్నాం. ఆయన మనకు కేవలం 'ప్రేమ'తో చేస్తున్నారు అన్న ఎరుకలో ఉంటూ, ఆ ప్రేమని అందరికీ పంచుదాం, 'తండ్రికి తగ్గ బిడ్డలుగా' ఉందాం. ఆయన సంపద ప్రేమ, ఆనందం, తృప్తి – ఆయన సొత్తుకి మనం వారసులవుదాం.

నిజంగా ప్రేమించడం అంటే ఆయన్ను ఆయనగా ప్రేమించడం. ఆయన ఎలా ఉన్నా ప్రేమించడం. ఆయన సర్వాన్ని ప్రేమించడం. ఆయన కోపాన్ని, ఆయన ప్రేమని, తిట్లను (ఆశీర్వచనాలు), దయను, కరుణను ఇలా ఆసాంతాన్ని ప్రేమించడమే నిజమైన ప్రేమ. అలా మనల్ని ప్రేమిస్తున్నారు కనుకనే అవసరార్థమై చెంతకు చేరువవుతున్న మనల్ని ఆదరిస్తున్నది. దాన్నే మిషగా చేసుకొని బోధిస్తున్నది. మన పని చేసిపెట్టారు. ఆయనపట్ల మనకు కృతజ్ఞతాభావం కలిగిఉందాం. ఇహంలో సాటివారితో చెప్పినట్లు సింపుల్‌గా 'థ్యాంక్స్' చెప్పినట్లు కాక, ఆయన బోధను గ్రహించి, అనుగుణంగా ప్రవర్తిస్తే ఆయన ఆశించిన గుణగణ సంపద మనదై ఆయనకు తగ్గవాడిగా పరిణితి చెందుతాం. ఆ పరివర్తన, పరిణామాలే.. నిజమైన కృతజ్ఞత. మనం బాబాకు సేవ చేయడం అంటే ఆయనవాడిగా, తగ్గవాడిగా మనలో రుగ్మతలు తొలగించు కునేందుకు ఆయన చెప్పినట్లు చేయడం, ఆయన నడిచి చూపిన బాటన నడవడమే–ఆయన్ను ప్రేమించిన దానికి గురుతు.

తమ గురువుతో ప్రేమ గురుతులు ఎలా ఉంటాయో గమనిద్దాం. శ్రీభరద్వాజ మాష్టర్‌గారి పట్ల శ్రీబాబూజీకి ఉన్న ప్రేమాభిమానాలకు చిన్న ఉదాహరణ. మాష్టర్‌గారు శ్రీసాయిలో ఐక్యం చెందినప్పుడు వారి పార్థివ దేహాన్ని శ్రీబాబూజీ కడసారిగా దర్శించుకొని, నమస్కరించి, నుదిటిపై నిలువుగా ఊదీని రాసారు. మాష్టర్‌గారికి చివరిసారిగా చేసుకున్న ఆ 'సేవ'కు ఒక జ్ఞాపకంగా, ఒక స్మరణగా, గురుతుగా శ్రీబాబూజీ జీవిత పర్యంతం బాబా ఊదీని తమ నుదిటిపై నిలువుగానే ధరించేవారు. మాష్టర్‌గారిపట్ల వారికున్న ప్రేమ అంతటిది.

**– గురుకృప**

**ప్రేమించడం అంటే ద్వేషాన్ని త్యజించడమే - సాండిల్యుడు**



## సాధన గురించి... నవంబర్ 2015



**భక్తుడు :** గురువుగారూ! పరిపూర్ణత్వస్థితి కోసం చేసే అన్వేషణ గురించి, ఆధ్యాత్మిక సాధనల గురించి కొందరు మాట్లాడుతూ, "గమ్యాన్ని చేరుకున్న ఒక సద్గురువు కోసం అన్వేషించండి, వారిని శరణు వేడండి. తక్కినదంతా ఆయన చూసుకుంటారు" అంటారు. మరికొందరేమో, "మీ అంతరంగంలోనే అన్వేషించుకోండి, సమాధానం అక్కడే ఉంది, భగవంతుని స్వర్గ సామ్రాజ్యం లోపలే ఉంది" అంటారు ఇంకొందరు, "మీ అన్వేషణే మీకు సత్యాన్ని కనిపించకుండా అడ్డుపడుతుంది, కాబట్టి అన్వేషణకు స్వస్తి పలకండి" అంటున్నారు. ఇవన్నీ నిజమేనా? ఇవేవీ కాకుండా అన్వేషణను మరో విధంగా చూడటానికి మార్గమేదైనా ఉందా?

**గురువుగారు :** ఏదైనా ఒక విషయం చెప్పినపుడు అది ఏ సందర్భంలో చెప్పబడిందో చూడాలి. మీరు సత్యాన్వేషణను ఎలా చూస్తున్నారనే దానిని బట్టే అంతా ఉంటుంది. కాబట్టి చూసే దృక్కోణాన్ని బట్టి ప్రతి వివరణా సరైనదే కావచ్చు.

**భక్తుడు :** గురువుగారూ! "నన్నెవరైతే నిరంతరం స్మరిస్తారో వారు గమ్యం చేరుతారు" అన్నారు బాబా. మేము బాబాను నిరంతరం గుర్తుపెట్టుకోవడానికి ఉపయోగపడే సాధనేదైనా ఉందా?

**గురువుగారు :** సాధన – ఒకవేళ మీరు ఏదైనా సాధన చెయ్యాలని అనుకుంటే ఆ సాధన మీలోని ఏదో ఒక అవసరానికి సమాధానంగా ఉండాలి. మీరు నిద్రపోవడం, తినడం, స్నానం చేయడం, పళ్ళు తోముకోవడం మొదలైన వాటిని ఎలాగైతే చేస్తారో సాధన కూడా అలాగే ఉండాలి. మీరు ఈ పనులన్నీ ప్రతిరోజూ చేస్తారు కానీ, "నేను తినడాన్ని సాధన చేస్తున్నాను, పళ్ళు తోముకోవడాన్ని సాధన చేస్తున్నాను" అని అంటారా? అనరు కదా. నిజానికి ప్రతిరోజూ మీరు ఈ సాధనలు చేస్తున్నారు, వాటి వలన కలిగే ప్రయోజనాలను పొందుతున్నారు. అయినప్పటికీ మీరు వాటిని సాధనలుగా భావించరు. అవి మీ అవసరాలు. ఆ అవసరాలు తీర్చుకోకపోతే వాటి వలన కలిగే ప్రయోజనాలను మీరు కోల్పోతారు. మీకు అసౌకర్యంగా ఉంటుంది. అందుకని తినడం, నిద్రపోవడం, స్నానం చెయ్యడం ఎలా చేస్తున్నారో బాబాను కూడా అలాగే గుర్తుపెట్టుకోండి. అప్పుడు అది నిజమైన



సాధనవుతుంది. ఒకవేళ మీరు ఏ సాధనైనా చేయవలసివస్తే దానిని ఈ పద్ధతిలో చేయండి. ఆహారం తీసుకోవడం మీలో ఆకలి అనే అవసరాన్ని తీరుస్తుంది. అలాగే బాబాను గుర్తుపెట్టుకోవడం కూడా మీలోని ఒక అవసరాన్ని తీర్చాలి. అదీ నిజంగా గుర్తుపెట్టుకోవడం అంటే, స్మరణ అంటే. అలా కాకపోతే ఈ స్మరణ వలన ఎటువంటి ప్రయోజనం లేదు. మీరు బాబా నామాన్ని లక్షలసార్లు జపించినా ఉపయోగం లేదు. బాబా నామాన్ని జపించాలనుకునే వారికి నేను సాధారణంగా ఇదే విషయాన్ని చెబుతుంటాను. మీరు బాబా నామాన్ని పది లక్షలసార్లు చెయ్యాలనుకుంటే చెయ్యండి మంచిదే కానీ అది మీలోని అవసరానికి సమాధానం కానపుడు ఊరకనే అలా పలకడం వలన ఏమిటి ప్రయోజనం?

**భక్తుడు :** గురువుగారూ! కొంతమంది ఆధ్యాత్మిక గురువులు ఫలితం రాకపోయినా మనం చేస్తున్న సాధన ఆపవద్దని అంటారు.

**గురువుగారు :** మీరు వాళ్ళ సలహాను పాటించాలనుకుంటే పాటించండి. కానీ నేను అలా చెప్పను. మీరు ఏదైనా ఒక సాధన చేస్తున్నప్పుడు ఏదో ఒక ఫలితాన్ని పొందాలి. అది చిన్నదైనా కావచ్చు, పెద్దదైనా కావచ్చు. మిమ్మల్ని మీ లక్ష్యంవైపుకు తీసుకువెళ్ళేదిగా ఉండాలి. దానివలనే మీరు ఎలా సాధన చేస్తున్నారు అనే విషయం తెలుస్తుంది. సాధన గురించి మన అవగాహన ఏమిటి? సాధన ఎందుకు చేస్తున్నాం? ఎలా చేస్తున్నాం? మన లక్ష్యం ఏమిటి? ... అని, మన సాధనలోని లోతుపాతులు మనం అర్థం చేసుకుంటే మంచిది. అప్పుడది మనకు సరైన ఫలితాన్ని ఇస్తుంది.

**భక్తుడు :** ఆధ్యాత్మిక సాధనలు కొన్నిసార్లు దుష్ఫలితాలను చూపుతాయని మీరు చెప్పారు. అది ఎలా గురువుగారూ?

**గురువుగారు :** ఆధ్యాత్మిక సాధనలు సాధకునికి ఒక బూటకపు సంతృప్తిని ఇస్తాయి. ఆ సాధకుడు తను ఏదో సాధన చేస్తున్నట్లుగా భావిస్తాడు. కానీ ఆ సాధన అతని హృదయాన్ని స్పృశించదు. హృదయగతం కాదు. అంతకుమించి ముందుకు పోవడానికి అతను ప్రయత్నించడు. అలాంటి సందర్భాలలో మనం చేసే సాధన ప్రతికూల ప్రభావాన్ని కలుగచేస్తుంది.

తనకు ఒక రోగం ఉందని ముందు తెలుసుకుంటే ఎవరికైనా డాక్టర్ దగ్గరకు వెళ్ళాలని, మందు తీసుకోవాలని ఆరాటం కలుగుతుంది. తనకసలు రోగం ఉన్న సంగతే తెలియకపోతే ఎవరైనా చికిత్స కోసం ప్రయత్నిస్తారా? ఈ సాధనలంతా చేసేవారు, “నేను గొప్ప సాధకుణ్ణి, ఒక గొప్ప యోగిని, నేను వేదాభ్యాసకుణ్ణి. నాకు వంద ముద్రలు తెలుసు, రెండు వందల బంధాలు తెలుసు”

**ఆ ఎరుకకు అనుగుణంగా మసలుకోవడమే వారిలో మనం ఉండటం.**

అనుకుంటూ ఉంటారు. సద్గురువు వచ్చి, "ఇది సరైన పద్ధతి కాదు" అని అతనికి తెలియచెప్పినా వినిపించుకోరు. నిద్రపోయేవారిని లేపవచ్చు, నిద్రపోతున్నట్లు నటించేవారిని లేపడం సాధ్యం కాదు. సాయిబాబా వంటి సద్గురువుల వద్దకు వచ్చిన తరువాత కూడా ఇటువంటి రకరకాల సాధనల పట్ల వ్యామోహంతో రకరకాల ముద్రలు, యోగాలు, మంత్రాలు, తంత్రాల పేరుతో చాలా సమయం వృధా చేసుకునే వాళ్ళున్నారు.



అందుకే నేను, మీలో ప్రేమ కలిగితే (జాగృతమైతే) ఏ సాధనలు, ఎటువంటి ప్రక్రియలు, మంత్రాలు ఇవేవీ అవసరం లేదంటాను. మీరు మీ సద్గురువును తెలుసుకున్న తరువాత ప్రతి ఒక్కటీ మంత్రమవుతుంది. ఆయన పేరు మంత్రమవుతుంది. ఆయన చేసే చర్యలు మంత్రమవుతాయి, ఆయన గురించి ఆలోచించడం మంత్రమవుతుంది. ఇలా ప్రతిదీ సాధనవుతుంది. ప్రతిదీ మీ ప్రేమకు వ్యక్తీకరణవుతుంది. మంత్రం అనేది ఒక వాహకం, ఒక వాహనం, ఒక మాధ్యమం. కానీ ఆ ప్రేమ లేకపోతే ఆ వాహనం ఖాళీగా ఉంటుంది. ఆ వాహనంలో రవాణా కావల్సిందేమిటి? ప్రేమ. అది ప్రేమను తీసుకురావాలి – అదీ మంత్రమంటే.

**గురువుగారు :** సద్గురువు మీలో అస్పష్టంగా ఉన్న ఆ సంపూర్ణత్వ భావనను జాగృతం చేసాక, అది ఇంకా ఇంకా స్పష్టంగా, వాస్తవరూపాన్ని సంతరించుకుంటుంది. "నాకు కావలసింది ఇది" అని తెలుస్తుంది. అప్పుడు నిజమైన అన్వేషణ ప్రారంభమవుతుంది. నిజమైన పరిశోధన, నిజమైన ప్రయత్నం, నిజమైన తపన మొదలవుతుంది. అంతకుముందు మీరు చేసే అన్వేషణ అగమ్యగోచరంగా ఉంటుంది. మీకు అప్పుడు మీరెందుకు అన్వేషిస్తున్నారో తెలియదు, అలాగని మీరు అన్వేషించకుండా ఉండనూలేరు. అది ఒక రకమైన నిస్సహాయమైన అన్వేషణ.

సాధారణంగా అందరూ అన్వేషణ ఎటువంటి ఆనందాన్ని ఇవ్వదనుకుంటారు. కానీ అది నిజమైన అన్వేషణ అయితే, అన్వేషణ కూడా ఆనందాన్ని ఇస్తుంది. మన అన్వేషణ పరిపూర్ణమైన ఆనందం కోసం. మనకు లభించేది పరిపూర్ణ ఆనందమే, మార్గమంతా ఆనందభరితమే.

**భక్తుడు :** గురువుగారూ! మా హృదయాలు వికసించి ఆనందం అనుభవమైనపుడు, ఆ అనుభవం మా అన్వేషణకు ముగింపనుకోవచ్చా?

**గురువుగారు :** అది ముగింపు కాదు. నిజానికి అప్పుడు మరో రకమైన అన్వేషణ ప్రారంభమవుతుంది. తద్వారా మనకు ఆనందం ఇంకా ఎక్కువగా, పరిపూర్ణంగా అనుభవమవుతుంది. మనకు ఆకలేసినపుడు మనం ప్లేటు ఆహారం కోసం చూస్తాం, మనకు ఆహారం లభించాక దానిని చక్కగా తినడమెలా అని

**బ్రతికేటందుకు తింటే అన్నీ బలకరమే. తినేటందుకు బ్రతికితేనే శరీరం పాడవుతుంది. -శ్రీరమణులు**



ఆలోచిస్తాము, అన్వేషిస్తాము. అలా ఆ ఆహారాన్ని తిన్న తరువాత, అలా కడుపునిండా తినడం వల్ల కలిగిన ఆనందానుభూతిని ఆస్వాదించడం ఎలా? కాస్త కునుకు తీయాలనిపిస్తుంది (కాస్త కునుకు తీయడానికి అవకాశముందా అని చూస్తాం) మనం అన్వేషించడం ఆగిందా?

**భక్తుడు :** ఆనందానుభవాన్ని మన అన్వేషణకు నిజమైన ఆరంభం అనవచ్చా?

**గురువుగారు :** అవును. అక్కడ నుండి నిజమైన అన్వేషణ ప్రారంభమవుతుంది. కానీ మీరు ఆ ఆనందానుభూతిని చవిచూడకపోతే (ఆకలి తీరకపోతే) ఒక ప్లేటు ఆహారం కోసం చూడటం మన అన్వేషణ అవుతుంది. లేదా ఒక హొటలు వెతుక్కోవడం అన్వేషణ అవుతుంది. అసలు మీకు ఆకలే కాకపోతే మీ జీర్ణవ్యవస్థను బాగుచేసే డాక్టరు కోసం వెతుక్కోవడం అన్వేషణ అవుతుంది (గురువుగారు నవ్వుతూ)

**భక్తుడు :** అంటే అన్వేషణే మనకు ఆనందాన్నిస్తుందంటారా?

**గురువుగారు :** మనది నిజమైన అన్వేషణే అయితే అది ఆనందాన్ని ఇస్తుంది. నిజమైన అన్వేషణ ఒక స్థాయిలో మనకు బాధను కలిగిస్తుంది. కానీ మనం బాధపడుతున్నా ఆ బాధను ఇష్టపడతాం. అందువల్లనే అన్వేషణ ముందుకు సాగుతుంది. ఉదాహరణకు, ముందు మీరు ఉద్యోగం ఎక్కడ దొరుకుతుందా అని చూస్తారు. ఎవరో వచ్చి, "హైదరాబాదుకు వెళ్ళు, నీకు ఉద్యోగం దొరుకుతుంది" అంటారు. మీరు హడావుడిగా బస్టాండ్‌కు వెళ్ళి బస్సుల గురించి వాకబు చేస్తారు. అప్పుడు మీ అన్వేషణ సరైన బస్సును పట్టుకోవడం. బస్సులోనికి ఎక్కాక మీరు సీటు కోసం చూస్తారు. సీటు దొరుకుతుంది. "హమ్మయ్య" అనుకుంటారు. తరువాత మీరు హాయిగా నిద్రలోకి జారుకుంటారు. మీరు గమ్యస్థానాన్ని చేరుకున్నారా? మీరు ఇంకా శిరిడీ బస్టాండ్‌లో ఉన్న బస్సులోనే ఉన్నారు కానీ అది మీరు మీ గమ్యస్థానాన్ని చేరుకోవడంతో సమానం, ఎందుకంటే మీరు సరైన బస్సులో ఉన్నారు. మీరు ఆనందంగా కూర్చుని నిద్రపోతారు. బస్సు హైదరాబాదుకు వచ్చినా మీరు ఇంకా బస్సులోనే ఉన్నారు. కానీ బస్సు గమ్యాన్ని చేరుతుంది. ఇక్కడ అన్వేషణే సంతోషాన్ని, ఆనందాన్ని ఇస్తుంది. అది ఆనందపూర్ణమైన అన్వేషణ.

**భక్తుడు :** ఈ అన్వేషణ ఎప్పటికైనా ముగుస్తుందా?

**గురువుగారు :** అన్వేషణకు ముగింపు ఉండదు. అది మరో రూపాన్ని సంతరించుకుంటుంది. ఇంకో రకమైన అన్వేషణ ప్రారంభమవుతుంది. ఆ అనుభవాన్ని మరింత పరిపూర్ణం చేసుకోవడానికి

**ఆశయము లేక ఆశతో కూడి జీవించువాడు ఇంద్రియలోలుడగును.**



అన్వేషిస్తాం. ఆ అనుభవం పరిపూర్ణంగానే వచ్చినప్పటికీ మనం దానిని పరిపూర్ణంగా అనుభవంలోనికి తెచ్చుకోవాలి. ఇది నిరంతర పరిపూర్ణత్వాన్వేషణ. రమణ మహర్షికి మధురైలో ఆత్మసాక్షాత్కారమైన తరువాత, "నేను నా తండ్రి కోసం అన్వేషిస్తున్నాను" అని చెప్పి (వ్రాసి పెట్టి) ఆయన అరుణాచలం వచ్చారు. ఆయన తమ అన్వేషణను అలా వ్యక్తం చేసారు. (ఆత్మసాక్షాత్కారంతో) ఆయన అన్వేషణ ముగిసిందా?

**భక్తుడు :** గురువుగారూ! సాక్షాత్కారం పొందడంలోని వివిధ దశల గురించి వివరిస్తారా?

**గురువుగారు :** నేను దీని గురించి ఇది వరకే చెప్పాను. ఉదాహరణకు మీరు ఒక మొద్దును గొడ్డలితో ముక్కలు చేయాలి. మీరు ఒకటి, రెండు, మూడు, నాలుగు దెబ్బలు వేస్తారు. అది పదవదెబ్బకు విరిగిందనుకోండి. అది ఒక్క దెబ్బకే విరిగింది. కానీ అది పదవదెబ్బ. ఆ మొద్దు ఒక్క దెబ్బకు విరిగిందా లేక పది దెబ్బలకు విరిగిందా? ఏది నిజం? తొమ్మిదవ దెబ్బకు కూడా అది విరగలేదు - మీరు తొమ్మిదో వేటును విరగడంలో ఒక దశ అంటారా? అప్పటికింకా అది విరగలేదు. పదవ ప్రయత్నంలో మీరు సఫలీకృతులయ్యారు, మొద్దు విరిగింది. అది మొదటి దెబ్బకే విరిగిపోయి ఉండవచ్చు. మీరు వేసిన ఈ తొమ్మిది దెబ్బలు మీకు మొద్దును విరగ్గొట్టే ఆ నేర్పును, నైపుణ్యాన్ని ఇచ్చాయి. కానీ చివరిగా అది ఒకే దెబ్బకు పగిలింది. ఒకవేళ మీరు తొమ్మిది దెబ్బలు వేసి ఆగితే మొద్దు విరగదు. అసలు మీరు ప్రయత్నమే చెయ్యకపోయినా మొద్దు విరగదు. ఈ రెండింటి మధ్య ఉన్న తేడా ఏమిటి? మొద్దు విరిగిందా, లేదా! అది ఒక్క దెబ్బకే విరిగింది. మీరు దానిని ఒక్క దెబ్బలో సాక్షాత్కారం పొందడమంటే అందులో దశలు లేవు. మీరు సాక్షాత్కారం పొందారా, లేదా! క్షణకాలం పాటు అలా వచ్చి ఇలా పోయే సాక్షాత్కారం అంటూ ఏమీ ఉండదు. కొంతమంది తమకు చాలా అద్భుతమైన అనుభవం వచ్చిందని, క్షణకాలంపాటు సాక్షాత్కారమయిందని, తరువాత దానిని కోల్పోయామని అంటారు. వాళ్ళు తమ మిగతా జీవితాన్నంతా కోల్పోయినదానిని తిరిగి సాధించడానికి వినియోగిస్తారు. వాళ్ళకు వచ్చిన అనుభవాన్ని నేను నిరర్థకం అనడం లేదు - అది చాలా మంచి అనుభవం కావచ్చు, వాళ్ళు దానిని కోల్పోయారంటే ఆ అనుభవానికి వాళ్ళను సొంతం చేసుకునేటంత బలం లేదని తెలుస్తుంది. వాళ్ళలో ఇంకా ఆ అనుభవం కంటే బలమైన భావోద్వేగాలు, ఇష్టాలు, కోరికలు ఉన్నాయి. అందువలనే వారు ఆ అనుభవం నుండి బయటకు వచ్చారు. అటువంటి బలహీనమైన, అలా తాత్కాలికంగా వచ్చి పోయిన అనుభవాన్ని తిరిగి పొందడానికి ప్రయత్నించడంలో ప్రయోజనం ఏముంది? మనం మన ప్రయాణం మొదలుపెట్టింది అలాంటి అనుభవం కోసం



కాదు. మనం పరిపూర్ణమైన ఆనందం కోసం, నిజమైన శాశ్వతమైన దాని కోసం, ఇలా వచ్చి అలా పోని అనుభవం కోసం అన్వేషణ మొదలుపెట్టాం. మీరు మీ లక్ష్యాన్ని ఎందుకు మార్చుకుంటున్నారు? మనం సాక్షాత్కారం కన్నా ఏ మాత్రం తక్కువకాని దాని కోసం మన ప్రయాణాన్ని ఆరంభించాం. కానీ ఒక ఉత్తేజభరితమైన (థ్రిల్లింగ్) అనుభవం వచ్చాక తిరిగి అనుభవాన్ని పొందడమనేది మీ లక్ష్యమైంది. దానిని సాక్షాత్కారంలో ఒక దశ అనుకుంటున్నారు.

మనకు నిజంగా సాక్షాత్కారమైతే – వాస్తవానికి నిజంగా సాక్షాత్కారం అవడం అంటూ ఉండదు. ఇందులో దశలు ఉండవు. మనకు సాక్షాత్కారమైందా, లేదా? అంతే. మనకు రెండుసార్లు సాక్షాత్కారం కావడమంటూ ఉండదు. మనకు రెండవ సాక్షాత్కారం అవసరమైందంటే మనకు తొలిసారి పరిపూర్ణంగా సాక్షాత్కారం కాలేదని అర్థం. మనం దానిని సంపూర్ణంగా తెలుసుకోలేదు. మనకు అక్కడొక విషయం ఉందని మాత్రం తెలిసింది. కానీ మనకు దాని గురించి పరిపూర్ణంగా తెలియదు. కాబట్టి నేను చెప్పినదాని సారాంశమేమిటంటే సాక్షాత్కారంలో దశలు లేవు.

**భక్తుడు :** గురువుగారూ! మీరు రమణమహర్షి జీవితచరిత్రను మొదటిసారి చదివినపుడు వారి చరిత్ర మీకు ఈ జన్మలోనే సాక్షాత్కారం సాధ్యమవుతుంది అనే విశ్వాసాన్ని కలిగించిందని చెప్పారు. కానీ నాకు, ఈ జీవితంలో నేను సాధించగలిగినదానికి, సాక్షాత్కారం పొందిన ఒక మహాత్ముని అనుభవానికి చాలా దూరంగా ఉన్నట్లనిపిస్తుంది. ఒక మహాత్ముని అనుభవం మన అనుభవంతో పోలిస్తే ఎంత భిన్నంగా ఉంటుంది? నిజంగా అదంత భిన్నంగా ఉంటుందా?

**గురువుగారు :** మీరు ఎలా ఉంటే బావుంటుంది అనుకుంటున్నారు – తేడా ఎక్కువగా ఉండాలను కుంటారా లేక తక్కువగా ఉండాలనుకుంటారా? (నవ్వులు) మీకు ఏది ఆకర్షణీయంగా ఉంది? నేను మీకు ఉదాహరణనిస్తాను. ఆ తరువాత తేడా ఎక్కువుందా, తేడా తక్కువుందా అనే విషయం మీరు నాకు చెప్పండి. ఒకరోజు సాయంత్రం చీకటిపడ్డాక మీరు సత్సంగానికి వస్తున్నారు. తిరువణ్ణామలైలో మన సత్సంగానికి మొదటిసారి వస్తున్న క్రొత్త వ్యక్తి గేటుకు కాస్త దూరంలో నిలబడి ఎవరన్నా సాయం వస్తారా అని చూస్తున్నాడు. అతను గేటు వద్ద ఉగ్రంగా చూసే రెండు పెద్ద డాబర్‌మేన్ కుక్కలు చూసాడు. అందువల్ల లోపలికి రావడానికి భయపడుతున్నాడు. ఇంతలో మీరు అక్కడకు వచ్చి అతనితో "ఇక్కడెందుకు నిలబడి ఉన్నారు?" అని అడిగారు.

"అదీ... అక్కడ గేటు దగ్గర రెండు పెద్ద కుక్కలున్నాయి, అందువల్ల నేను గురువుగారి ఇంటి



లోపలికి వెళ్ళలేకపోతున్నాను!"

"కుక్కలు ఎక్కడున్నాయి?"

"అదిగో అక్కడ చూడండి, ఆ కుక్కలు..."

"లేదు, లేదు. అవి కుక్కలు కాదు, బొమ్మలు".

అతనికవి నిజమైన కుక్కల్లాగా కనిపించాయి. అతను వాటిని కుక్కలనే అనుకున్నాడు, కానీ మీకు మాత్రం అవి బొమ్మలు. అప్పుడతను, "లేదు, లేదు, నేను నమ్మను. అవి నిజమైన కుక్కలే" అంటాడు. "మీరు రండి, నేను తీసుకెళతాను!"అని మీరతని చెయ్యి పట్టుకొని గేటు వద్దకు తీసుకెళతారు. అతను భయపడుతూనే మీ వెంట వస్తాడు. భయానికి రెండడుగులు ముందుకు, ఒక అడుగు వెనుకకు వేస్తూ వస్తాడు. అతను గేటు వద్దకు వచ్చి ఆ కుక్కలను దగ్గరగా చూసి, "ఓహ్, ఇవి నిజంగా బొమ్మలేనా" అని ఊపిరి పీల్చుకుంటాడు (గురువుగారు నవ్వుతూ....) ఆ వ్యక్తి ఇంతకుముందు చూసినదానికి, ఇప్పుడు చూసిన దానికి ఉన్న తేడా చిన్నదా, పెద్దదా, చాలా పెద్దదా? చెప్పండి! ఈ ప్రపంచం అంతా ఆ కుక్క బొమ్మలాంటిది. మనకు దాని వాస్తవరూపం తెలియదు కాబట్టి మనం దానిని చూసి భయం, ప్రేమ, ఈర్ష్య, లోభం మొదలైన వివిధ భావోద్వేగాలతో ప్రతిస్పందిస్తాం. సద్గురువు వచ్చి అది మనం అనుకునేటటువంటిది కాదని, మరో రకమైనదని చెప్తారు, కానీ మనం దానిని విశ్వసించం. ఆ తరువాత ఆయన మన చెయ్యి పట్టుకొని మన లక్ష్యంకేసి నడిపించుకుని వెళతారు. మీరు ఆ లక్ష్యాన్ని చేరుకున్నాక, దానిని ప్రత్యక్షంగా చూసాక అది మీరు ఇన్నాళ్ళూ చూస్తున్నదేనని తెలుసుకుంటారు. కానీ ఇప్పుడు మీరు దానిని చూడటంలో కొంత తేడా ఉంటుంది. భగవాన్ వంటి మహాత్ములు మనం చూసేదాన్నే చూస్తుంటారు. కానీ కొంత విభిన్నంగా చూస్తారు. ఆ తేడా చిన్నదా, పెద్దదా, అనంతమైనదా, అది మనం ఎలా చెప్పగలం? వ్యత్యాసం ఉంది, అంతే చాలు. ఆ వ్యత్యాసం ఎలా ఉంటుందంటే మనం మొత్తాన్ని క్రొత్తగా అనుభవిస్తాం (నవ్వులు..)

**భక్తుడు :** గురువుగారూ! మా లక్ష్యాన్ని చేరుకోవడానికి మార్గాన్ని కనుక్కోవడం ఎలా?

**గురువుగారు :** మనం మార్గంలోనే ఉన్నాం. మనం ఇప్పటికే పరిణామక్రమంలో ఒక దశలో ఉన్నాం. ఒక విత్తనం భూమిపై పడి మొలకెత్తి పువ్వుగా మారి పూలు పూసిందనుకుందాం. చూడటానికి అది మిగతావాటితో సంబంధంలేని క్రొత్త మొక్కలాగా కనిపించినప్పటికీ నిజానికది అంతకుముందున్న మొక్క నుండి వచ్చిన విత్తనానికి కొనసాగింపే. ఒక పువ్వు చాలా అందంగా ఉండవచ్చు, మీరు దానిని త్రుంచకుండా అలానే ఉంచినప్పటికీ అది దానికై అదే వాడి రాలిపోయి మరో పువ్వుపుట్టడానికి



అవకాశాన్నిస్తుంది. ఆ క్రొత్త పువ్వు మరో రకంగా, మరోరూపంతో, తాజా పరిమళంతో, క్రొత్తరంగులో ఉంటుంది – ఇవన్నీ మార్గాలే.

**భక్తుడు :** మనం ఈ పరిణామక్రమాన్ని గమనిస్తూ దానిపట్ల ఎరుకతో ఉండాలా? అలా ఉంటే అది ప్రయోజనకరంగా ఉంటుందా?

**గురువుగారు :** ఈ పరిణామక్రమాన్ని గమనిస్తూ ఉండటం మన లక్ష్యం కాదు. అక్కడ గమనించడానికేముంది? పరిణామం జరుగుతుందని మీరు తెలుసుకుంటే చాలు. భోజనం చేసాక జీర్ణక్రియను మీరు గమనిస్తూ ఉండాలా? అది నిరంతరంగా జరిగే సహజమైన ప్రక్రియ. ఈ పరిణాక్రమంలో మనం ఒక స్థాయిలో ఉన్నామని తెలుసుకుంటే చాలు. వెనుకకు వెళ్ళడానికిగాని, ముందుకు దూకడానికి గానీ ప్రయత్నించవద్దు. ఆ పరిణామంలో భాగమై పరిణతి చెందండి. అది నిరంతరం జరిగే ప్రక్రియ అని గుర్తించి, దానిని దృష్టిలో పెట్టుకొని ఎదగండి.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు, "ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే, యుగే" అన్నాడు. అంటే 'ఆయా కాలాలను బట్టి భగవంతుడు వివిధ రూపాలలో అవతరిస్తాడు. లేదా అప్పటి కాలానికి చెందిన అవసరాలను బట్టి నేను మళ్ళీ మళ్ళీ ఉద్భవిస్తాను'. మరుగునపడిన (సనాతనమైన) ధర్మాన్ని, ప్రభోదాన్ని  ముందుకు తీసుకురావడానికి సద్గురువు వివిధ రూపాలలో ప్రకటమవుతారు.

ఈ పరిణామక్రమాన్ని అడ్డుకోవాలని ప్రయత్నించినపుడు మనుషులకు దుఃఖం కలుగుతుంది. వాళ్ళు ఆ పరిణామక్రమంలో భాగంగా మారితే ఆనందం కలుగుతుంది. ఈ పరిణామక్రమమే ధర్మం – ప్రకృతి స్వభావం. అగ్ని దహిస్తుంది, అది దాని ధర్మం. నీళ్ళు పల్లానికే ప్రవహిస్తాయి లేదా ఏ పాత్రలలో పోస్తే ఆ పాత్ర రూపాన్ని ధరిస్తాయి, అది వాటి ధర్మం.

అందుచేత మనలోని ధర్మంపట్ల, ప్రపంచం యొక్క ధర్మంపట్ల, మన ఉనికి యొక్క ధర్మం పట్ల మనం ఎరుకతో ఉండాలి. మనం ఈ ధర్మానికి అనుగుణంగా నడుచుకుంటే దుఃఖం ఉండదు. భగవాన్ రమణులు, 'నీవెవరో తెలుసుకో, నీ నిజమైన ఆత్మస్వరూపాన్ని, నీ నిజస్వభావాన్ని తెలుసుకో" అన్నారు. మన 'నిజస్వభావం' ఏమిటి? ఒక వ్యక్తి కాదు; అది ధర్మం. మానవధర్మానికి అనుగుణంగా నడుచుకునేవాళ్ళు మంచివాళ్ళు (ధార్మికులు). ధర్మబద్ధత అంటే ఏమిటి? మన ధర్మానికి, ప్రకృతి ధర్మానికి, విశ్వసూత్రాలకు అనుగుణంగా ఉండేది ధార్మికత. మన పరమధర్మం ఏమిటి? ప్రకృతికి అనుగుణంగా నడుచుకోవడం. భగవద్గీతలో శ్రీకృష్ణుడు "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం

వ్రజ– అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః” (అన్ని ధర్మాలు త్యజించి నాలో శరణుపొందు, సర్వపాపాల నుండి నేను నిన్ను రక్షిస్తాను, చింతించవద్దు) అన్నాడు. అంటే, మిగిలిన ధర్మాలన్నీ అప్రధానం, నాకు శరణు పొందడమే పరమధర్మం. అదే ప్రాథమికమైన ధర్మం. మిగిలిన ధార్మిక విషయాలను నీవు వదలిపెట్టవచ్చు.



నువ్వు ఈ శరణాగత స్థితిని సాధిస్తే – సంపూర్ణ శరణాగతి సాధిస్తే – మిగతావన్నీ సహజంగా జరిగిపోతాయి. చాలా సందర్భాలలో అందరూ తక్కిన ధర్మాలకే ప్రాధాన్యతనిచ్చి వాటి వెనకుండే ప్రాథమికమైన స్ఫూర్తి గురించి, వాళ్ళు చేసే పనుల వెనుక గల మౌలిక లక్ష్యం గురించి మర్చిపోతారు. అప్పుడు సాయిబాబా వంటి మహాత్ములు అవతరించి మన మనస్సులను సహజస్వభావం (శరణాగతి) వైపుకు మరలిస్తారు. “నాకు శరణుపొందండి. మీ భారాన్ని నేను వహిస్తాను, నాకు పగ్గాలు అప్పగించండి, నేను మిమ్మల్ని చివరికంటా గమ్యం చేరుస్తాను” బాబా ఎప్పుడూ తమ ప్రతి మాటలోనూ శరణాగతి యొక్క ఆవశ్యకతనే ప్రముఖంగా చెప్పేవారు.

## గురువు - శిష్యుడు *డిసెంబర్ 2015*

**భక్తుడు** : గురువుగారూ! భక్తునికి, శిష్యునికీ మధ్య తేడా ఏమిటి?

**గురువుగారు** : ఒక వ్యక్తిని లేదా దేవతామూర్తిని ప్రేమిస్తూ, అంకితభావంతో వారిని ఆరాధిస్తూ, పూజిస్తూ ఉండేవాడు భక్తుడు. గురువు విధించిన ఓ నిర్దిష్టమైన సాధనా పద్ధతిని అనుసరించేవాడు శిష్యుడు. శిష్యుడంటే శిక్షణ ప్రధానమైన అంశం: అక్కడ ఒక ఉపదేశం, ఒక మార్గం, అనుసరించాల్సిన నియమాలు, విషయాలు ఉంటాయి. భక్తుడంటే అతనికి ఒక వ్యక్తి పట్ల లేదా ఒక విషయం పట్ల భక్తి, ప్రేమ, ఆరాధన ఉంటాయి. భక్తుని విషయంలో ఇవే ప్రధానం. బాబా సాంప్రదాయరీతిలో ఎవరికీ ఎటువంటి సాధననూ నిర్దేశించలేదు. కాబట్టి బాబాకు శిష్యులంటూ ఎవరూ లేరని చెప్పవచ్చు. నిజానికి మనకు క్రమశిక్షణ లేదని బాబాకు తెలుసు కాబట్టే ఆయన, “నాకు శిష్యులు ఎవ్వరూ లేరు” అని అన్నారు. (నవ్వులు...)



**భక్తుడు** : గురువుగారూ! మీకు శిష్యులు లేరని ఎందుకంటారు? నా దృష్టిలో శిష్యుడు అంటే తన గురువు పట్ల భక్తిభావాన్ని కలిగి ఉండి వారి వద్దనుంచి తాను ఏదో నేర్చుకుంటున్నాను అని భావించేవాడు. అక్కడ (వాచా) వ్యక్తమైనా కాకపోయినా అక్కడ (గురు) ప్రబోధం ఉంటుంది. నా వరకు



నన్ను నేను ఒక శిష్యునిగానూ, భక్తునిగానూ భావించుకుంటున్నాను. మీరు, "నాకు శిష్యులెవ్వరూ లేరు" అని చెప్పడంలో ఏదైనా ప్రత్యేకమైన కారణం ఉందా? బాబా తమకు శిష్యులున్నారని చెప్పలేదా?

**గురువుగారు** : తమకు శిష్యులెవరూ లేరని బాబా స్పష్టంగా చెప్పారు. ఈ విషయాన్ని బాబా చెప్పారు. రమణమహర్షీ చెప్పారు. తమకు శిష్యులున్నారని అనుకునేవాళ్లు వందలాదిమంది ఉన్నారు. వారిని గురించి నేను మాట్లాడటంలేదు. బాబా, రమణమహర్షి వంటి గొప్ప మహాత్ములే తమకు శిష్యులెవ్వరూ లేరని చెప్పినపుడు నాకు శిష్యులున్నారని చెప్పడానికి నేనెవరిని? నాకు బాబానే ఆదర్శం. ఆయనే నా గురువు, దైవం, ఇష్టదేవతాస్వరూపం.

**భక్తుడు** : "నాకు శిష్యులు లేరు" అన్నప్పుడు బాబా ఉద్దేశ్యం ఏమిటి గురువుగారూ?

**గురువుగారు** : బాబా ఇంగ్లీషు నిఘంటువు (డిక్షనరీ) చూసి పదాలకు నిర్వచనాలు చెప్పలేదు. (గురువుగారు నవ్వుతూ...)ఆయన తమకు శిష్యులెవరూ లేరన్నారు. అంటే, తమను తాము గురువుగా భావించుకోవడంలేదని ఆయన ఉద్దేశ్యం. తమకు శిష్యులెవరూ లేరని చెప్పినపుడు రమణమహర్షి భావం కూడా ఇదే. నేను చెప్పినా నా ఉద్దేశ్యమూ అదే. నన్ను నేను గురువుగా భావించుకోను. నేను గురువును కానప్పుడు నాకు శిష్యులెలా ఉంటారు? రమణమహర్షి దీనిని చాలాచాలా స్పష్టంగా చెప్పారు. గురువు తనను తాను మీకు గురువుగా చేసుకోడు. ఆయనను గురువుగా చేసుకోవలసింది మీరే. నన్ను నేను బాబా భక్తునిగా భావించుకుంటున్నాను. కానీ బాబా నన్ను తన భక్తుడినని లేదా శిష్యుడినని అనుకోకపోవచ్చు. దాని గురించి నాకు చింత లేదు. నేను నావైపు నుండి, నా అనుభవంలోనుండి మాట్లాడుతున్నాను. బాబా దీనిని ఎలా అనుభూతి చెందుతున్నారని నేను ఆలోచించను. మీరు బాబాను గురువుగా చూస్తే అది సరైనదే. అదే అసలు సూత్రం. మహాత్ముల మార్గం కూడా అదే. గొప్ప మహాత్ములు తమను తాము గురువులుగా ఎన్నటికీ భావించుకోరు. మనం వారి వద్దనుండి ఈ ఆదర్శాన్ని, సందేశాన్ని తీసుకోవాలి. అంతటి మహాత్ములే తమకు శిష్యులున్నారని చెప్పనప్పుడు ఆ మాట అనడానికి రేణువుల్లాంటి మనమెంతటివారం?

**భక్తుడు** : కానీ, మనల్ని మనం శిష్యులుగా భావించుకోవచ్చు కదా గురువుగారూ?

**గురువుగారు** : మీకు ఎలా కావాలంటే అలా భావించుకోవడానికి మీకు సర్వహక్కులూ ఉన్నాయి. (గురువుగారు నవ్వుతూ) మిమ్మల్ని మీరు భక్తులుగా కూడా భావించుకోవచ్చు. ఎలా అనుకున్నాసరే,

అలా అనుకోవడం మీవైపు నుండి జరుగుతుంది. నిజానికి ఇదే ముఖ్యం. మీరెలా అనుకుంటున్నారనేదే ముఖ్యం. మీరు నన్ను ఎలా చూస్తున్నారు అనేది ముఖ్యం కానీ నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నాననేది కాదు. నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నాననేది కూడా ముఖ్యమైనదే, కానీ మీరు దానిని అర్థం చేసుకోలేరు. ఆ సంబంధాన్ని ఇంగ్లీషు నిఘంటువును చూసి వేదాంత పరిభాషతో ఫలానా అని ముద్ర వేయకండి. నేనేమిటి, నేనెలా ఆలోచిస్తాను, నేను మిమ్మల్ని ఎలా చూస్తాను – వీటిని మీరు నిఘంటువులో చూసి తెలుసుకోలేరు. కాబట్టి దాని గురించి ఆలోచించవద్దు. అలాంటి ఆలోచనలతో మిమ్మల్ని మీరు ఇబ్బంది పెట్టుకోవద్దు. మీరు నాతో ఒక అనుబంధాన్ని కలిగి ఉండి దానివలన మీకు తగిన సమాధానం దొరుకుతుంటే అది చాలు.



**భక్తుడు** : గురువుగారూ! నేను జీవితపర్యంతం దేనికోసమైతే వెతుకుతున్నానో అదే మీరు. ఇప్పుడు ఇక్కడ మీరు నా కళ్లముందు భౌతికంగా ఉన్నారు. నేను మీతో ఎలా ఉండాలో, మీలా ఎలా ఉండాలో మీ వద్ద నుండి నేర్చుకోవాలనుకుంటున్నాను.

**గురువుగారు** : మంచిదే. నేనూ అదే చెబుతున్నాను. మీరు నన్ను ఎలా చూస్తున్నారన్నదే ముఖ్యం. నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నాననేది ముఖ్యం కాదు.

**భక్తుడు** : గురువుగారూ! మీరిక్కడ తిరువణ్ణామలైలో ఉండటం మా అదృష్టంగా భావిస్తున్నాము. మీ ప్రబోధానికి మేమెంతో కృతజ్ఞులం.

**గురువుగారు** : చాలా రోజుల నుండి తిరువణ్ణామలై పట్ల ఇది నా స్వంత ఊరు అనే భావన ఉంది. అందుకని ఇక్కడకు వచ్చి కొంత సమయం గడపాలనుకున్నాను. ఆ తరువాత మీరు వచ్చారు. మీతో కలిసి కూర్చుని మాట్లాడటం జరిగింది, అంతే. నేనేదో మీకు బోధిస్తున్నట్లు నేను భావించడం లేదు. మీరు వచ్చి నా ఉపన్యాసాలు వినమని ఎవ్వరికీ ఆహ్వానాలు పంపలేదు. పత్రికలలో ప్రకటనలు ఇవ్వలేదు. తనవద్ద ఉన్నదానిని సాటివారితో పంచుకోవడమన్నది స్వాభావికమైన మానవధర్మం. దానికి అనుగుణంగానే నేను పంచుకుంటున్నాను. అనవసరంగా అందరూ నన్ను "గురువుగారూ" అని పిలుస్తున్నారు. నేను గురువును కాదు. ఇక్కడకు వచ్చేవాళ్లకు ఒక గురువు కావాలి. నాలో వాళ్లు గురువును చూసుకుంటున్నారు. "గురువుగారూ" అని పిలుస్తున్నారు. అది వారి అవసరం. అందుకే నేను మౌనంగా ఉంటున్నాను. నాకు శిష్యులు అవసరంలేదు. కాబట్టి నేను వారిని ఆ దృష్టితో చూడను. శిష్యులు లేకుండా గురువు ఉండగలడా? 'గురువు' అన్న పదం సాపేక్షమైనది.



**భక్తుడు** : మీరు మీకెవరూ శిష్యులు లేరంటారు, కానీ వాళ్ళేమో మీ శిష్యుల మంటున్నారు.

**గురువుగారు** : వాళ్ళు అలా అంటే అనవచ్చు. ఎందుకంటే వారి మనస్సులోని భావాన్ని అలా వ్యక్తం చేయడం వారికి అవసరం కావచ్చు. వాళ్లతో వద్దు అని చెప్పడానికి నేనెవరిని? వాళ్ళు ఏం చెప్పాలనుకుంటున్నారో దానిని చెప్పడం వాళ్ల హక్కు. కొంతమంది నేను మోసగాడిని అని చెప్పవచ్చు. అటువంటి వాళ్లకూ అలా చెప్పే స్వేచ్ఛ ఉంది. వాళ్ళ అభిప్రాయాలు వాళ్ళకి ఉండవచ్చు. నన్ను విమర్శించడం వాళ్ళ అవసరమైతే, వాళ్ళను అలానే చెయ్యనివ్వండి. నన్ను పూజించడం కొంతమందికి అవసరమైతే వారినీ అలా చెయ్యనివ్వండి. వాళ్ళ భక్తిని నేను నా అవసరానికి వాడుకోనంతవరకు, వారి భక్తి వారిలోని ఒక అవసరాన్ని తీరుస్తున్నంతవరకు నేను చేసేది కేవలం పంచుకోవడం మాత్రమే. ఇది జబ్బుతో ఉన్న వ్యక్తికి మందివ్వడంలాంటిది. నేను వాళ్ళ వద్దనుండి విరాళాలు తీసుకొని, ఆశ్రమం కట్టడం మొదలుపెడితేనో, లేక వారి వద్దనుండి కానుకలు స్వీకరిస్తేనో నాపట్ల వారికి ఉన్న భక్తిని నేను వాడుకోవడానికి అవకాశం ఉంటుంది. అందుకనే నేను, నాకు ఎటువంటి ఆస్తిపాస్తులు లేకుండా ఉండాలని, ఎవ్వరి వద్దనుండి ఎటువంటి కానుకలు, విరాళాలు తీసుకోకూడదని ఖచ్చితమైన నియమం పెట్టుకున్నాను. ఎప్పుడైతే అందరూ మనల్ని పూజించాలనుకుంటారో అప్పుడు మనం నిరంతరం జాగ్రత్తగా ఉండాలి. అందుకే నేను చాలా జాగ్రత్తగా ఉంటాను.

**భక్తుడు** : గురువుగారూ! సద్గురువు పట్ల మా ప్రేమ మాకు వివిధ మార్గాలలో విభిన్న స్థాయిలలో అనుభవమౌతోంది. ఈ వ్యత్యాసానికి కారణం ఏమిటి? వివిధ రకాలైన ప్రేమ ఉంటుందా? లేక ప్రేమలోని తీవ్రత యొక్క వ్యత్యాసమే ఆ తేడాలకు కారణమవుతుందా?

**గురువుగారు** : మన సంస్కారాలు, సద్గురువుతో మనకు గల పూర్వసంబంధాలను బట్టి ప్రేమ వివిధ రూపాలను తీసుకుంటుంది. ఒకరు తాను బిడ్డననుకోవచ్చు. ఒకరు శిష్యుడిననుకోవచ్చు. ఒకరు సేవకుణ్ణి అనుకోవచ్చు.

**భక్తుడు** : సద్గురువుకు ఆ పూర్వసంబంధాల గురించి తెలిసి వుంటుందా?

**గురువుగారు** : సాధారణంగా సద్గురువుకు తెలిసి ఉంటుంది.

**భక్తుడు** : శిష్యునికి కూడా తెలియాల్సిన అవసరం ఉందా?

**గురువుగారు** : శిష్యునికి తెలియాల్సిన అవసరంలేదు.



**భక్తుడు** : గురువుగారూ! సద్గురువు చెంతకు చేరుకున్న ప్రతి ఒక్కరికీ పూర్వసంబంధం ఉంటుందా? ఒక వ్యక్తి సద్గురువును తొలిసారిగా కలుసుకునే అవకాశం ఉంటుందా?

**గురువుగారు** : ఒక వ్యక్తి సద్గురువుగా భావించే స్థితికి చేరుకున్నప్పుడు, అది ఋణానుబంధం, పూర్వసంబంధాల వలనే జరుగుతుంది. అంతకుముందు వారిద్దరి మధ్య వేరే రకమైన సంబంధం ఉంటే ఉండవచ్చు. అది గురుశిష్యుల సంబంధం మాత్రమే కావాల్సిన అవసరంలేదు. కానీ ఆ వ్యక్తి "ఆయన సద్గురువు" అనే అవగాహనకు రావడం మొదలుపెట్టాక అది తొలిసారి కలుసుకోవడమయ్యే అవకాశం లేదు. అది వాళ్ల పూర్వజన్మ సంబంధం కారణంగానే జరుగుతుంది.

**భక్తుడు** : గురువుగారూ! ఈ పథంలో ఒక శిష్యునికి ఉండవలసిన ముఖ్యమైన అర్హతలు ఏమిటి?

**గురువుగారు** : శిష్యుడు అనేది ఒక భావన. మీవైపు నుండి చూస్తే మీ పరిపూర్ణత్వ భావనకు చిహ్నంగా నిలిచి, ఆ భావనను జాగృతం చేసిన వ్యక్తిని లేదా విషయాన్ని (సద్గురువును) చూసిన క్షణం నుండి మీరు శిష్యుడవడం మొదలైనట్లు అనిపిస్తుంది. కానీ సద్గురువు వైపు నుండి చూస్తే మీరు అంతకుమునుపే అతనికి శిష్యులు. ఆ కారణం చేతనే ఆయన మిమ్మల్ని ఎన్నుకున్నారు. మీలో ఉన్న ఆర్తి, అస్పష్టంగా ఉన్న సంపూర్ణత్వ భావనను వాస్తవం చేసుకోవాలన్న మీ అవసరమే దానికి కావలసిన అర్హతలు. నిజానికి ఇవి మీకు అంతకుమునుపే (సద్గురువు చెంతకు రాక మునుపే) ఉన్నాయి. సద్గురువు దగ్గరకు రావడానికి ముందు నుండే మీరు మీ పరిపూర్ణత్వభావనను వాస్తవం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. కానీ సద్గురువు వద్దకు వచ్చిన తరువాత ఆ అవసరం మరింత పరిణతి చెందిన ఒక వ్యక్తీకరణగా మారుతుంది. అందుకనే నేను కేవలం సద్గురువు వద్దకు వచ్చి శరణాగతి చెంది, ఆధ్యాత్మికతను గురించి ఆలోచన చేసే వాళ్లు మాత్రమే సాధకులనుకోవద్దని ఎప్పుడూ చెబుతుంటాను. ప్రతి ఒక్కరూ సాధకులే. ప్రాణమున్న ప్రతీ జీవి అన్వేషిస్తోంది. వారంతా తమకు అస్పష్టంగా ఉన్న పరిపూర్ణత్వ భావనను (సెన్స్ ఆఫ్ ఫుల్‌ఫిల్‌మెంట్) రకరకాల మార్గాలలో వాస్తవం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొంతమంది అన్ని మార్గాలను ప్రయత్నించి చూసిన తరువాత లేదా తమ అవసరంలోని అసలైన తత్వాన్ని (సూక్ష్మాన్ని) గుర్తించగలిగిన సున్నితత్వాన్ని పొందిన తరువాత, ఆధ్యాత్మిక మార్గంలో తమ పరిపూర్ణత్వభావనను వాస్తవం చేసుకోవాలని ప్రయత్నిస్తూ వారిని వారు శిష్యులమని ముద్ర వేసుకుంటారు.

**సహాయం కోసం నిజాయితీగా, నిష్కపటంగా, హృదయపూర్వకంగా అడగండి.**



**భక్తుడు** : తమ పరిపూర్ణత్వానికి వాస్తవిక రూపమైన ఆ స్వరూపానికే వారు శిష్యులవుతున్నారు. అంతే కదా గురువుగారూ! వాళ్లు తమ పరిపూర్ణత్వాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవడానికే వారు ఆ రూపాన్ని సేవించాలనుకుంటారు.

**గురువుగారు** : అవును. అంతకుముందు వాళ్లు తమకు పరిపూర్ణత్వం (ఆనందం) వేరే వేరే మార్గాలలో వస్తుందనుకునేవారు. కానీ ఇప్పుడు అది ఒకే మూలం నుండే వస్తోందని, అన్ని కోరికలు తీరడానికి అదే కారణమని వారికి తెలుస్తుంది. మీకు వేరే కోరికలు ఉండకూడదని కాదు. ఉండవచ్చు, కానీ వాటిని తీర్చుకునే మార్గం మారుతుంది. మన దృష్టి, ప్రయత్నించే పద్ధతి మారుతుంది. మీరు, "నా కోరికలన్నీ తీరడానికి ఈయనే (సద్గురువు) మార్గం, అంతిమ పరిపూర్ణత్వం కూడా సద్గురువు ద్వారానే వస్తుంది" అని తెలుసుకుంటారు. ఆ క్షణం నుండి మీరు మీలో పరిపూర్ణత్వభావనను జాగృతం చేసిన ఆ సద్గురువుపైనే దృష్టి పెట్టి ఆయననే అంటిపెట్టుకుంటారు. అప్పటినుండి మీరు శిష్యులనే విషయం తెలుసుకోవడం మొదలుపెడతారు. మీరు సద్గురువుపై ఎంతగా దృష్టి పెడితే మీరు అంతగా యోగ్యులైన శిష్యులుగా మారుతారు. ఒక శిష్యునిగా మారడానికి ఇదే నిజమైన పద్ధతి. అంతకుమించి ఎటువంటి అర్హతలూ లేవు. ఈ విషయం తెలుసుకోకపోతే, ఉత్తమమైన శిష్యులుగా మారడానికి మీరు చేసే ప్రయత్నాలన్నీ అసలు విషయానికి దూరంగా ఎక్కడో చేసే ఒక అభ్యాసాలుగా, కసరత్తులుగా మారుతాయి. అది నిజమైన విషయపరిజ్ఞానం లేకుండా పట్టా (డిగ్రీ) ఉన్నట్లు ఉంటుంది.

కాబట్టి ఇదీ సూత్రం, అన్ని అర్హతలకూ మూలమిది. శాస్త్రాలలో చెప్పిన అర్హతలన్నీ దీనితోనే ముడిపడి ఉన్నాయి. శాస్త్రాలలో చెప్పిన ఏదైనా ఒక అర్హతను లేదా ఒక అంశాన్ని తీసుకోండి. నేను చెప్పినదానికి అది ఎలా వర్తిస్తుందో చూడండి. ఈ సూత్రాన్ని తీసుకుని లోతుగా ఆలోచించండి. ఒక్కొక్కరి విషయంలో అది ఒక్కోరకంగా వ్యక్తం కావచ్చు. మీరు ఎలా నడుచుకుంటున్నారు, మీ పరిపూర్ణత్వానికి ప్రతిరూపమైన దానిని (సద్గురువు) ఎలా అంటిపెట్టుకుంటున్నారు, ఎలా మనస్సు లగ్నం చేస్తున్నారు, అన్ని కోరికలను నెరవేర్చుకోవడానికి దానిని మార్గంగా ఎలా ఉపయోగపెట్టుకుంటున్నారు మొదలైన అంశాలు వ్యక్తిని బట్టి మారవచ్చు. కానీ అదంతా నేను చెప్పిన ఆ ప్రాథమికమైన అర్హత మీద ఆధారపడి ఉంటుంది.

**భక్తుడు** : గురువుగారూ! శిష్యునిలో పరిణితి వచ్చిందనడానికి గుర్తులు ఏమిటి?

**గురువుగారు** : పరిణితికి గుర్తులేమిటో ఎందుకు తెలుసుకోవాలనుకుంటున్నారు? మీరు ర్యాంకులేమైనా

ఇవ్వాలనుకుంటున్నారా? తన ఆరాధ్య విషయం (సద్గురువు) గురించి తప్ప మరే ఇతర విషయం గురించి ఆలోచించకపోవడమే నిజమైన పరిణితికి చిహ్నం. అటువంటి వ్యక్తి పరిణితిని సూచించే గుర్తులను కోరుకోడు. అదే అసలైన పరిణితికి గుర్తు. (గురువుగారు నవ్వుతూ..)



**భక్తుడు** : కనీసం మాకు పరిణితి రాలేదన్న విషయమైనా మేము తెలుసుకోవాలి కదా?

**గురువుగారు** : మనకు పరిణితి రాలేదని, మనం పరిణితి చెందాలని ఒప్పుకొని, మనకు సద్గురువుతో అనుబంధం ఉందనే ఒక్క విషయాన్ని గుర్తుంచుకుంటే చాలు. మనకు ఆ సంబంధం ఉన్నంతవరకు, మనం పరిణితి చెందడమన్నది సహజంగా జరిగే ప్రక్రియ. ఒక పండును తీసుకోండి. అంతకుముందు అది పచ్చిగా ఉంటుంది. పుల్లగా ఉంటుంది. అందులో తియ్యదనం ఉండదు. అది చెట్టుకు ఉన్నంతవరకు దానికి పోషణ లభిస్తుంది. అది తియ్యగా మారుతుంది. ఎలా పక్వానికి రావాలి, ఎంత పక్వానికి రావాలి, ఎంత పక్వానికి వచ్చాను ఇలాంటి విషయాలతో పండుకు పనిలేదు. చెట్టే దానిని పక్వానికి తీసుకువచ్చి తనంతట తానే పండును విడిచిపెట్టే వరకు, చెట్టుతో తనకు గల సంబంధమే పండుకు ముఖ్యం. నేను పరిణితి చెందే ప్రక్రియలో భాగమైన పరిపూర్ణత్వభావం, భద్రతాభావన, అనుబంధ భావన, మనకు అనుభవమయ్యే ప్రేమ మొదలైన వాటి గురించి మాట్లాడుతున్నాను. ఒకవేళ మీరు వాటిని గుర్తులు అందామనుకుంటే ఇవే పరిణితికి గుర్తులు, పండుకు తియ్యదనాన్ని ఇచ్చేవి ఇవే. తియ్యదనమే నిజమైన పరిణితికి గుర్తు. చెట్టుకు ఉండే పండు పక్వానికి వచ్చి తియ్యగా మారుతుంది. ఇది ప్రకృతి ధర్మం. మనం బాబాతో శృతిలో ఉన్నంతవరకు మనం పరిణితి చెందుతాం. ఎన్నో కొమ్మలున్న బాబా అనే చెట్టు కొమ్మకు మనం ఇప్పుడు వ్రేలాడుతూ ఉన్నాం.

**భక్తుడు** : గురువుగారూ! నేను సరైన శిష్యుణ్ణి కాదని మీరు నన్ను తిరస్కరిస్తారేమోనని నాకు భయంగా ఉంది.

**గురువుగారు** : నేను ఇంతకుముందు ఎన్నోసార్లు చెప్పాను. నేను అంగీకరించినందువల్లనో, లేదా నేను తిరస్కరించినందువల్లనో మీరు ఇక్కడ ఉండటం లేదా ఉండకపోవడం జరగదు. అది బాబా సంకల్పం. నేను మిమ్మల్ని ఎప్పుడూ బాబా ప్రసాదంగానే చూస్తాను. నేను ఇన్నిసార్లు చెప్పినా ఇంకా ఎవరైనా నేను వారిని తిరస్కరించానని అనుకుంటే నేను చెప్పినదానిలోని ప్రాథమికమైన విషయాలు కూడా వారు అర్థం చేసుకోలేదనుకోవాలి. మీరు పరిపూర్ణులు కావాలని, ఆనందంగా ఉండాలని, మీ గమ్యం చేరుకోవాలని నేను కోరుకుంటాను. నాకు కావలసింది అది. నేను మీకు ఎన్నో



సత్సంగాలలో చెప్పాను. మనం ఇక్కడ ఇలా (సత్సంగంలో) ఊరకే కూర్చుని ఉన్నాం. ఇలా మాట్లాడుకోవడాన్ని నేనేమీ గొప్ప విషయంగా చూడను. నేను మీకు నిజంగా ఏం చెప్పాలనుకుంటున్నానో దానిని నేను నా పద్ధతిలో తెలియచేస్తాను. బాబా మీకు సాయం చేస్తున్నారని ఎప్పుడూ నేను అనుకుంటూ ఉంటాను. మీరు ఇక్కడుంటే మీకు ఉప యుక్తంగా ఉంటుందని బాబా అనుకోబట్టే మిమ్మల్ని ఇక్కడకు పంపించారు – నేను దానిని గౌరవిస్తాను. మిమ్మల్ని ఇక్కడకు పంపించిన వారికి (బాబాకు) మీకు ఎలా సహాయం చెయ్యాలో తెలుసు. దానిగురించి నేను ఆలోచించడం ఎందుకు? నేను ఎవ్వరినీ ఆహ్వానించను. "ఇక్కడకు రండి, నేను మీకు సహాయం చేస్తాను" అని నేనెప్పుడూ చెప్పను. నాతో ఉండమని నేను ఎవ్వరికీ చెప్పను. వాళ్లు వెళ్లిపోతానంటే నేను అభ్యంతరపెట్టను. నేను ఎవ్వరినీ తిరస్కరించను. నేను ప్రతి ఒక్కరినీ అంగీకరించడానికి కారణం నాకు వాళ్లు బాబా ప్రసాదం. బాబా సంకల్పం లేకుండా, బాబా పిలుపు లేకుండా ఎవ్వరూ నా వద్దకు రారు. ఒకవేళ మీకు, నాకు మధ్య ఏదైనా అనుబంధం ఉంటే అది బాబానే. అంతకుమించి మన మధ్య సంబంధం ఉండటంగానీ ఉండక పోవడంగానీ నాకు కనబడదు. నేను చూసే పద్ధతి ఇది. మీకు నాతో అనుబంధం ఉందని మీరు భావిస్తే మంచిది. అది మీవైపు నుండి, మీరు అలా చూస్తున్నారు. నేనెలా చూస్తున్నానో నేను చెబుతున్నాను. నాకు ఈ విషయంలో చాలా స్పష్టత ఉంది. మీరందరూ నాకు బాబా ప్రసాదం. పవిత్రమైన ప్రసాదం. ఎవరైనా బాబా ప్రసాదాన్ని ఎలా తిరస్కరించగలరు?

**భక్తుడు** : గురువుగారూ! మీకు మేము బాబా ప్రసాదం కావచ్చు. కానీ నేను మీకు శిష్యునిగా భావించుకుంటున్నాను.

**గురువుగారు** : మంచిది. మీ భావనను అంటిపెట్టుకోండి. నేను దానిని తిరస్కరించడంలేదు. కాదనడంలేదు. మీకలా ఉందంటే మంచిదే. మీరు నన్ను నిజంగా సద్గురువుగా భావిస్తుంటే, తిరస్కరించడమనే విషయం హాస్యాస్పదమైనది. ఎందుకంటే, "నేను తిరస్కరించబడ్డాను" అంటున్నారంటే మీరు నన్ను సద్గురువుగా భావించడంలేదు. ఒక సద్గురువు ఎవ్వరినీ తిరస్కరించడు. బాబా కూడా ఇదే చెప్పారు. "నేను ఎవ్వరినీ తిరస్కరించను, సముద్రం నదులను వెనుకకు పంపుతుందా" అన్నారు. సముద్రం తనలో కలవడానికి వచ్చిన నదులను తిరస్కరించగలదా? అది ఎన్నటికీ సాధ్యంకాదు. సద్గురువు సముద్రం వంటివారు. కాబట్టి తన వద్దకు వచ్చేవాళ్లను తిరస్కరించడం ఎన్నటికీ జరగదు. నదులు వచ్చి సముద్రంతో కలసి ఒక్కటైపోతాయి.

# గురుకృపాలహరి



"అడిగిన వారికి అడిగినంత సమృద్ధిగా ఇవ్వమని నా యజమాని నన్ను ఆదేశించారు. కానీ నా మాటలు చెవినబెట్టేదెవరు? నా ధనాగారపు తలుపులు బార్లా తెరచిపెట్టి ఉంచాను. కానీ ఆ సంపదను తీసుకొనిపోయేవారే లేరు! ప్రజలు ఊరకే నా వద్దకొచ్చి 'ఇవ్వు!ఇవ్వు!' అంటారు. నేను 'తీసుకో'మంటాను. కానీ తీసుకునేవారేరి!" అన్నారు బాబా. యజమాని, గురువు, దైవం, ఈశ్వరుడు, భగవంతుడు పదమేదైనా పథం మాత్రం ఒక్కటే! సమృద్ధిగా అందివ్వడం ఈశ్వరుని వంతు అయితే ఆ ధనాగారపు చిరునామా తెలిసి, తమ సాధనా ప్రస్థానంలో ఆ ధనాగారపు తాళం చెవి చేతికంది – ఆత్మ సంతృప్తులై నిలిచేవారు కొందరైతే, బండ్లకొద్దీ ఆ సంపదను (ప్రేమను, ఆనందాన్ని) ప్రతీ మనిషి పొంది తరించాలని తపించేవారు మరికొందరు, అట్టి వాత్సల్యమూర్తులే సద్గురుచంద్రులు. అట్టి వారిలో నిత్యస్మరణీయులు – శ్రీసాయిబాబా, శ్రీసాయినాథుని శరత్‌బాబూజీ, శ్రీభగవాన్ రమణమహర్షి, శ్రీచంద్రశేఖర సరస్వతీస్వామి, శ్రీపూండీస్వామి ఇలా ఎందరో. ఈ అనుగ్రహ చంద్రుల దేదీప్యమాన వెలుగులలో భరతజాతి ఆస్తిక్యముతో పరిఢవిల్లినదని చెప్పుటలో అతిశయోక్తి కానరాదు. నిక్కమున గురువు 'చంద్రుడే' – పూర్ణ 'చంద్రుడు' – శరత్ 'చంద్రుడు'. ఏలనన యద్య దాచరతి శ్రేష్ఠః – ఆచరించి చూపటమే వారి మార్గము. గురు పరంపరాగతా సంపదను తాను అనుభవించడమే, ఆనందసంద్రమున ఓలలాడుటయేకాక, శ్రామికుడై, ధార్మికుడై, కర్తవ్య నిర్వహణాతత్పరుడై, త్యాగనిరతుడై చక్కని కూర్పును – జీవన ప్రమాణాన్ని నిర్వచిస్తాడు సద్గురుపథగాములకు. ఈ సద్గురు పదముద్రలను అనాదినుండి మన భరత కర్మభూమిన మనము దర్శించవచ్చును. శ్రీసాయి సామ్రాట్టు అంటారు – "నా గురువును 12 సంIIలు సేవించితిని. వారే నన్ను పెంచి పోషించిరి. భోజనమునకుగాని, వస్త్రములకు గాని నాకు లోటు లేకుండెను. వారు పరిపూర్ణులు. వారు ప్రేమావతారమని చెప్పవచ్చును. ఆ ప్రేమను నేనెట్లు వర్ణించగలను? వారు నన్ను మిక్కిలి ప్రేమించెడివారు. ఆ విధమైన గురువే యుండరు. నిరంతర ధ్యానములో నున్న వారిని తదేకముగా జూచుచుండెడివాడను. మేమిద్దరము ఆనందములో మునిగెడివారము. రాత్రింబవళ్ళు నిద్రాహారములు లేక నేను వారివైపు దృష్టి నిగిడ్చితిని. వారిని చూడనిచో నాకు శాంతి లేకుండెను. వారి ధ్యానము, వారి సేవ తప్ప నాకింకొటి లేకుండెను. వారే నాయాశ్రయము". కాలాటెక్కల్ ఆకులు తింటూ కాలగతి మరిచి (గురువుపై) పంచప్రాణాలను



కళ్ళలో నిలిపి సద్గురు సన్నిధిని సమస్తముగా భావించి చరించిన, శ్రీసాయి మహరాజ్ విలసిల్లిన సద్గురుపదభూమి మనది. ప్రపంచమే 'తలక్రిందు'లయినా సద్గురు చరణ ప్రాప్తికై పరితపించిన సాయిమహరాజ్ చరిత్ర మనది. ప్రాణాధారము గురువు అయిన వానికి ప్రాణములొక లెక్కా? సద్గురు స్వరూపులారా! ఇదిగో మరియొక చారిత్రక సత్యము – కంచిపీఠమునకు శంకర భగవత్పాదుల మొదలు ఆచార్య పరంపరలో ఎన్నడునూ పీఠాధిపతి లేని క్షణము, చంద్రమౌళీశ్వర సేవ జరగని రోజు కానరాదు.

ఇతఃపూర్వము సంచికలో మనమనుకున్నట్లు శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారి అభీష్టానుసారం – 'చిన్నారి గిని' – స్వామి వారి చెంతకు వచ్చి పీఠాధిపత్యము స్వీకరించుటకు సమయం చాలలేదు. కావున స్వామినాథన్‌కు అన్నగారైన 'లక్ష్మీకాంతన్'కు శ్రీమహాదేవేంద్ర సరస్వతీ నామధేయమున 67వ పీఠాధిపతులుగా కంచి పీఠాధిపత్యము నివ్వబడెను. సద్గురుచరణ కమల స్పర్శయే మన జాతికి ప్రాణవాయువన్న సమున్నత ఆదర్శము శ్రీమహాదేవేంద్ర సరస్వతిస్వామివారి రూపమున మనము గాంచవచ్చును. శ్రీపీఠపు పరివారము, పురజనము – వారిని పీఠప్రాతినిధ్యము వహించి చంద్రమౌళీశ్వర సేవకు – త్రిపురసుందరి పూజకు ఉద్యుక్తులవమని వేడినవేళ శ్రీమహేంద్ర సరస్వతీస్వామి తనకు గురువే ఈశ్వరుడని – గురువే త్రిపురాలను పాలించే తల్లి అని, మశూచి సోకిన తమ గురుచంద్రుల సేవనే చేసుకుంటూ, వారి చరణములకు అంకితమయ్యెను. శ్రీపీఠపు చరిత్రలో తొమ్మిది దినములు ఈశ్వర సేవనము జరగని గడ్డు దినములు ఇవియే. శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామివారు దేహత్యాగము చేసిన పిమ్మట ఉత్తర కార్యములు (సమాధి కార్యక్రమములు) జరుగువేళ శ్రీమహాదేవేంద్రులకు కూడా మశూచి సోకెను. ఋగ్వేద పరాయణులై, గురుసేవా తత్పరులై ప్రాణములు సద్గురుపదముల చెంత అర్పణగావించ ఉద్యుక్తులైన శ్రీమహాదేవేంద్రులకు కంచి పీఠారోహణ కార్యక్రమము జరుగకనే కాలము జరిగిపోయినది. "నగురోరధికం..." అంటూ సాగే తత్త్వాలకు ఆచరణాత్మక రూపం శ్రీమహాదేవేంద్రులు. ఈశ్వరార్చన – గురుచరణార్పణ – ఈ రెంటి మధ్య గురుచరణాలకే అంకితమయి తమ ఆయువునే – అర్చనగా సమర్పించిన శ్రీమహాదేవేంద్రులు మనకు ఆదర్శమవ్వాలని సద్గురు చరణాలకు ప్రణమిల్లుదాం. ఎందరు మహాత్ముల ఆదర్శాలను దర్శిస్తే స్థిరమవుతుంది మన అస్థిరచిత్తం. మద్గురుదేవులు శ్రీశరచ్చంద్రులు గురువాక్య పాలనా

**ఏకాగ్రచిత్తుడైన వ్యక్తి తన పనులలో పూర్తిగా నిమగ్నమైపోతాడు. అతడే భక్తుడు. –సద్గురు**

తత్పరులు - వారికి ప్రాణములన్నచో లెక్కలేకుండెను. గురువాక్యపాలనమే సర్వమాయెను. ఫలితము యొక్క చింత వారి నంటకుండెను. ఇదిగో వారి ఆదర్శము.



నేను 1971వ సం॥లో మాస్టరుగారిని మొదటిసారి కలుసుకున్నాను. తర్వాత ఆయన నాతో "సత్సంగం బాధ్యతలు తీసుకో" అన్నారు. దానర్థం ఏమిటంటే ఆ గదిని, బాబా ఫొటోలను సత్సంగానికి సిద్ధం చేయడం మాత్రమే. బాబా ఫొటోలు అలమరాలో ఉండేవి, వాటిని బయటకు తీసిపెట్టి పూలమాలలు వేయాలి. అది మామూలు సత్సంగం. మాస్టర్‌గారు 'దీని నిర్వహణా బాధ్యతలు నీవి' అన్నారు. ఆరు సంవత్సరాలపాటు, నేను పూండీలో గడిపిన రోజులలో తప్ప, ప్రతి గురువారం నేను ఆ బాధ్యతలు నిర్వర్తించాను. అది ఒక నియమం. కనీసం ఒక్కసారి కూడా నేను దానిని వదిలిపెట్టలేదు. ఒకవేళ వరదలు వస్తాయనుకుంటే నేను ముందుగా అయిదు గంటలకే బల్లకట్టు మీద విద్యానగర్ వెళ్ళేవాడిని. గాలివానలు, తుఫానుల వంటివి వచ్చినపుడు బస్సులుండేవి కాదు, నడిచే వెళ్ళేవాడిని. 104, 105 డిగ్రీల జ్వరం ఉన్నా సరే వెళ్ళేవాడిని. ఏం జరుగుతుంది? మహా అయితే నేను చచ్చిపోతాను, అంతేకదా? అంతకు మించి ఏమైనా జరుగుతుందా? ఏమీ జరగదు. వెళ్ళాల్సిందేనని ఆ ఆరు సంవత్సరాలలో నేను ఒక్కసారి కూడా వెళ్ళకుండా ఉండలేదు.

బండ్లకొద్దీ సంపదను జగమునకు పంచడమంటే ఏమిటో సద్గురు చంద్రుల జీవితచరిత్రలను అవగతం చేసుకొనే ప్రయత్నం చేస్తే అర్థమవుతుంది. జ్ఞాన, కారుణ్య స్వరూపాలచే లావణ్యముతో ఓలలాడిన ఈ గురుమూర్తుల రూపములు కడలుడిపి నీరాడని మానవునకు ఇహములోనే పరమునందించి హితమును కల్గించును. రుగ్మతతో వైద్యుని చెంతకు చేరిన మనిషికి కాల ఆహారనియమములతో, ఔషధ మోతాదులతో స్వస్థత ఏ విధముగా చేకూరునో అట్లే మహితాత్ముల చరిత్రలు మనలను 'లక్ష్య' శుద్ధులను చేసి 'మనిషి' 'దైవం'గా ఎదగడానికి దోహదమవగలవు. 'సంపదను సమృద్ధిగా 'ఇవ్వడం', ఇచ్చిన దానిని మనం 'తీసుకునేట్లు' చేయడం వారి వంతు'. పొందినదానిని సద్వినియోగం చేసుకోవడం మన వంతు. కంచి పరమాచార్యుల జీవితం - వారి గురుదేవులు వారికి ప్రసాదించిన 'సంపద' - వారిచ్చిన ఆ సంపదను పరమాచార్యులు జనబాహుళ్యానికి పంచినతీరు - ఎందరో బద్ధ జీవులలో వారి కరుణాంతరంగముతో భగవిద్వాశ్వమును పాదుకొల్పిన వారి వైశిష్ట్యము మన మనసులను సద్గురు సన్నిధానమును చేర్చగలవు.

**మీ జీవితంలోకి పసివారు వస్తే అది మీరు నేర్చుకోవలసిన సమయం. -సద్గురు**



గిని కుటుంబసమేతంగా స్టీము ఇంజను రైలులో కంచి చేరుకున్నారని ఇంతకుముందు ప్రస్తావించుకొని యున్నాము. తర్వాత జరిగిన సంఘటనల సమాహారాన్ని గిని మాటల్లోనే విని తరిద్దాం. ఇక్కడొక చిన్న మనవి. ***కంచి పీఠమునకు 66వ పీఠాధిపతి మరియు 68వ పీఠాధిపతి ఇద్దరి నామధేయములు శ్రీచంద్రశేఖర సరస్వతీస్వామి అని గమనించగలరు. 67వ పీఠాధిపతి శ్రీమహా దేవేంద్రసరస్వతీ స్వామి.***

“దక్షిణ ఆర్కాట్ జిల్లా తిండివనం టౌన్‌లో నేను క్రిస్టియన్ మిషనరీ స్కూలులో చదువుతున్న రోజులవి. అది 1907వ సం. మొదటి రోజుల్లో! ఆర్కాట్‌కు పదిమైళ్ళు మరియు కంచికి ఇరవై అయిదు మైళ్ళ దూరంలో ఉన్న కలవాయి గ్రామంలో శ్రీచంద్రశేఖరసరస్వతీస్వామి విడిది చేసి ఉన్నారని, మశూచి జ్వరంతో వారు విదేహులైనారని తెలియవచ్చింది. ఋగ్వేదాన్ని కొంత అధ్యయనం చేసి, పీఠంలోని ఆచార్యస్వాములకు సేవ చేసుకుంటున్న మా అన్నను పీఠాధిపతిగా నిర్ణయించబడినదన్న సమాచార మందింది. ఈమధ్యనే వైధవ్యం ప్రాప్తించిన మా అమ్మగారి అక్కకు ఒక్కగానొక్క కొడుకు నా అన్నగారు. మా అన్న సన్యాసం తీసుకుంటున్నారన్న బాధతో ఉన్న మా పెద్దమ్మను ఓదార్చడానికి కంచి పీఠంలో ఎవరూ లేరన్న స్థితిలో మేమందరం కంచికి వెళ్ళాలనుకున్నాం. తిండివనంలో స్కూళ్ళకు సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న మా నాన్నగారితో కలసి మేమందరం ఎడ్లబండిలో ‘కలవాయి’ వెళదామని సంకల్పించాం. అయితే మా నాన్నగారు తిరుచురాపల్లిలో విద్యాసదస్సుకు వెళ్లవలసి రావడంతో మా పెద్దమ్మను ఓదార్చడానికి నేను, మా సోదరులు, బంధువులు, మా అమ్మగారితో కలసి రైలులో కాంచీపురం బయలుదేరాము. కుటుంబమంతా శంకరాచార్య మఠంలో దిగారు. కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో నేను కుమారకోష్టతీర్థంలో ఆగాను. విదేహులైన ఆచార్యస్వాముల దశదిన మహాపూజ కోసం కావలసిన సామగ్రిని తీసుకునే నిమిత్తం శ్రీపీఠపు పరివారం కొంతమంది ఒక బండిలో కలవాయి వచ్చారు. అయితే వారిలో తరతరాలుగా పనిచేస్తున్న మొదలియార్ అనే సారధి నన్ను తనతో రమ్మనమని తీసుకెళ్ళాడు. మిగిలిన కుటుంబాన్ని తీసుకురావడానికి మరో వాహనం ఏర్పాటు చేయబడింది. ప్రయాణంలో ఉండగా ఆ సారధి – నేను ఇక ఇంటికి తిరిగి రాకపోవచ్చుని, నా జీవిత పర్యంతం ఇక నేను శ్రీమఠంలోనే గడపాల్సి వస్తుందని లీలగా తెలియచేసాడు. మొదలు నేను – మా అన్నగారు పీఠాధిపత్యం వహించారు, కనుక నేను వారితో ఉండాలన్నది వారి సంకల్పమేమోనని తలచాను. అయితే కేవలం పదమూడు సంవత్సరాల నేను వారికి మఠంలో



కార్యక్రమాలలో ఎలా సహాయపడగలను అన్న సందేహంలో ఉండి పోయాను.

మైళ్ళు సాగుతున్న కొద్దీ ఆ సారథి నాకు అసలు విషయం చెప్పడం జరిగింది. పూర్వాశ్రమంలో మా అన్నగారు, ఇప్పటి పీఠాధిపతులైన శ్రీమహాదేవేంద్ర సరస్వతీ స్వామివారిని కూడా మశూచి ఆవరించిందని అందుచేతనే నా కుటుంబంతో ప్రమేయం లేకుండా నన్ను త్వరత్వరగా కలవాయి తీసుకురమ్మన్నారని అతని మాటల సారాంశం. నిజానికి అతన్ని తిండివనం పంపి నన్ను తీసుకురమ్మని చెప్పారు. అయితే నేను కాంచీపురంలో అతనికి ఎదురుపడ్డాను. అతని మాటలు విన్న నేను నిశ్చేష్టుడనయ్యాను – ఈ ఊహించని పరిణామంతో విస్మయుడైన నేను అదే బండిలో క్రింద పడుకుని పోయి నాటికి నాకు తెలిసిన ఒకే ఒక్క ప్రార్థనాపూర్వకమైన 'రామా!రామా! అన్న స్మరణతో నా ప్రయాణాన్ని కొనసాగించాను. 'మరో బండిలో బయలుదేరిన మా అమ్మగారు పిల్లలతో కొంతసమయానికి మఠం చేరారు. ఇబ్బందులతో ఉన్న తన అక్కగారిని ఓదార్చేందుకు వచ్చిన మా అమ్మను ఇతరులు ఓదార్చవలసిన పరిస్థితి ఎదురయింది. నాకు ప్రాప్తించిన ఈ సన్యాసాశ్రమ కాషాయాంబరాలు నాకు ఎట్టి పరిత్యాగముల ఫలితమో లేదా కాలాన్ని గురు శుశ్రూషలో గడపడం వల్లనో లభించలేదు. నా సన్యాసాశ్రమ తొలినాటినుండే ఆ దివ్యసన్నిధిలో ఓ వంక సౌఖ్యాలు మరో వంక బాధ్యతలు ప్రాప్తించాయి." (సశేషం) **– గురుకృప**

## పరమగురువు ఏసు కథ

జోర్డాన్ నదీతీరమున నడచుచున్న ఏసును అనుసరించువారు అధికమగుచుండిరి. అన్ని వర్గముల నుంచి ఏసు ననుసరించువారు వచ్చి చేరుచుండిరి. అట్లు చేరు వారిలో సంఘమున అధికులైనవారు కూడా నున్నారు. ధనబలము, అధికార బలము, అంగబలము, ఆస్తిబలము కలవారు కూడా, ఆ బలములను విసర్జించి ఏసుతో నడచుటకే సంసిద్ధులైరి. ఆర్తులు, అర్థార్థులతో పాటు సర్వ సమర్థులు కూడా ఏసును చేరుట కొందరికి ఆశ్చర్యము కలిగించినది. జీవితమున సమృద్ధి యున్నవారు కూడా ఏసుననుసరించుటలో గల రహస్యము కొందరికవగాహన కాలేదు. వారిలో నొకడు ఏసు ప్రక్కన చేరి ఇట్లు ప్రశ్నించెను.

"అన్నియు కలవారు కూడా నిన్నాశ్రయించి అనుసరించుచున్నారు. వారేమాశించి యిట్లు



వర్తించుచున్నారు?" ఏసు నవ్వుచూ నిట్లనెను. "వర్తకుడొకడు వజ్రముల వ్యాపారము చేయుచుండెడి వాడు. ఆ వ్యాపారమున అతడు మిక్కుటముగ వృద్ధి చెందెను. సమస్త సుఖములను పొందెను. ఇక పొందవలసినదేదియు గోచరింపలేదు. అట్టి వర్తకునకు అకస్మాత్తుగా ఒక అపురూపమగు వజ్రము గోచరించినది. దానిని పొందవలెనన్నచో తనకున్న సమస్తమును అమ్మివేయవలెను. ఆ వర్తకుడు బాగుగా విచారించి, అపురూపమగు ఆ వజ్రమును పొందుటయే ప్రధానమని యితర వజ్రములు, సుఖములు, సంపదలు ఎన్నియున్ననూ దానితో సరికాదని నిశ్చయించుకొనెను. దానిని పొందని జీవితము వృథా అనిపించెను. అతడు దృఢచిత్తుడై తనకున్న వన్నియూ ఆ వజ్రము కొఱకై విక్రయించెను. అతడు మూర్ఖుడా లేక బుద్ధిమంతుడా?

పృచ్ఛకుడు ఆలోచింపసాగెను. ఒక్క వజ్రము కొఱకు సమస్తమును కోల్పోవుట అవివేకము కదా! అనిపించెను. కనుక అతడు మూర్ఖుడే అని పృచ్ఛకుడు పల్కెను. ఏసు నవ్వుచూ "అతడు నిజమగు జిజ్ఞాసుడు. మూర్ఖుడు కాదు. అతడు పొందదలచిన వజ్రము అపురూపము. దానిని పొందుటకు ఐహిక సంపదలు చాలవు. పూర్వమా వజ్రము పొందుటకు ఆలిని, సంపదలను కూడా విడచినవాళ్లు ఉన్నారు. ఆ వజ్రమే లభించినచో సమస్తము లభించినట్లే! దాని కొఱకు సామ్రాజ్యములు కూడా దానమిచ్చినవారు ఉన్నారు. అట్టి అపురూప వజ్రమును పొందినచో జీవుడు శాశ్వతుడగును. అమృతుడగును. అమరుడగును. దైవసామ్రాజ్యమున శాశ్వతముగ వర్ధిల్లును. పొందినచో అట్టి వజ్రమునే పొందవలెను. ఆ వజ్రము పేరు సత్యము. ఆ సత్యమే నా రూపమున భూమిపై తిరుగుచున్నది. దాని నెరుగుటకై, దానిని పొందుటకై సమస్తమును వదలి నాతో నడచువారు నిజమగు జిజ్ఞాసువులు. మూర్ఖులు కారు. ఇతరముల నాశించి నన్నాశ్రయించువారు ఇతరములను పొందుదురు. సత్యమునాశించి నన్నాశ్రయించు వారు నాతో శాశ్వతులై నడుతురు.

ఏసు జోర్డాన్ తీరమున నడచుచుండగా అనుచరుడొకడు చెంతకు చేరి "ప్రభూ! నీ వారెవరో, పై వారెవరో ఎట్లు తెలియగలదు. నీవారై చనువారిలో నేనొకడనై యుండవలెనన్నచో నా కర్తవ్యమెట్లుండవలెను? అని ప్రశ్నించెను. "గొఱ్ఱెలన్నియూ నావియే. మేకలతో నాకు సంబంధము లేదు. మేతకు ఎగబడునవి మేకలు. గ్రుడ్డిగ నమ్మి దారిన నడచునవి గొఱ్ఱెలు. నా తండ్రి సామ్రాజ్యమున మేకలకు తావు లేదు. నేనీ దేహము త్యజించి, నా తండ్రి సింహాసనమున సర్వదేవతా పరివేష్ఠితుడనై కూర్చొని యుండగా గొఱ్ఱెలన్నియూ నా కుడివైపున చేరును. మేకలు ఎడమ భాగమున నుండును".



"గొఱ్ఱెను కావలెనన్నచో ఎట్లుండవలెను?" "నేను ఆకలిగ వున్నప్పుడు అన్నము పెట్టువాడు, దాహముగా నున్నపుడు నీరిచ్చువాడు, అపరిచితుడుగ ఎదురైనపుడు ఆహ్వానించి ఆదరించువాడు, వస్త్రమిచ్చి రక్షించువాడు, నేనస్వస్థుడనైనపుడు నాకు సేవలనందించువాడు గొఱ్ఱెయై యుండును."

"లాభనష్టములను బేరీజు వేసుకొనువాడు, వాక్యమును ప్రదర్శించువాడు, ప్రపంచపు విలువలలో బ్రతుకువాడు, స్వీయరక్షణకై తాపత్రయపడువాడు మేకయై యుండును. గొఱ్ఱెలు మాత్రమే నన్ను చేరగలవు. మేకలు మరల మరల సంసార చక్రమున పరిభ్రమించుచు నుండును. నేనందరియందు నేనుగనే యున్నాను. నన్నందరియందు దర్శించువాడు, సేవించువాడు, ఆదరించువాడు ధన్యుడు. అట్టివాడు నా వెంట నావాడై, చనువాడై ఒకడుగ, శాశ్వతుడుగ నుండును. నేను గొఱ్ఱెల కొఱకే వచ్చితిని. నేను గొఱ్ఱెలకాపరిని. వారి యోగక్షేమములను సర్వదా, సర్వదా వహించి యుందునను".

**– 'నావాణి' నుండి స్వీకరించబడినది.**

## సమయం విలువ

**"కన్ను తెరిస్తే జననం**
**కన్ను మూస్తే మరణం**
**రెప్పపాటే కదా! జీవితం"**

అన్నారు ఒక సుప్రసిద్ధ కవి. ఇది నూటికి నూరుపాళ్లు యథార్థమే. ఈ స్వల్పమైన జీవితాన్ని సార్థకం చేసుకోవాలంటే మనం తెలుసుకోవలసింది ఒకటుంది. అదే సమయం విలువ. ప్రపంచంలో ఎన్నో విలువైన వస్తువులున్నాయి. కాని అన్నిటికంటే విలువైన వస్తువు సమయం. ఇది అందరికీ తెలిసిన విషయమే అయినప్పటికీ, దీన్ని గురించి ఎవరూ పెద్దగా పట్టించుకున్నట్టు కనపడరు. భారతీయ సంస్కృతి కాలాన్ని దైవస్వరూపంగా భావించింది. భగవంతుడు ఎంత ఉన్నతుడో కాలం కూడా అంతే ఉన్నతమైనదీ, విలువైనదీను. మనం ఏ వస్తువునైనా పోగొట్టుకుంటే మరలా సంపాదించుకోవచ్చు. డబ్బు పోతే మరల కొంతకాలానికి కూడబెట్టుకోవచ్చు. కాని కాలాన్ని కోల్పోతే తిరిగి పొందడం అసాధ్యం. అందుకే "క్షణము గడిచిన దాని వెనుకకు మరల్ప సాధ్యమే మానవునికి కాలచక్రమందు" అంటారు శ్రీజాషువ మహాకవి. ఒక్కమాటలో చెప్పాలంటే విశ్వవిఖ్యాతి గడించిన మహనీయులందరూ ఏ రంగానికి చెందినవారైనా కాలం విలువ బాగా తెలిసిన వారే. సమయాన్ని



సద్వినియోగపరచుకున్న వారే. కాలం అనేది మనం ఆపితే ఆగదు. కాబట్టి ఏ సమయంలో ఏ పని చెయ్యాలో ఆ సమయంలో ఆ పని చేస్తే సమయం సద్వినియోగపరిచినట్లే. 'ఆలస్యాదమృతం విషం' అన్నట్లు ఎప్పుడు ఏ పని చెయ్యాలో అప్పుడా పని చెయ్యకపోతే లాభం మాట అటుంచి నష్టం కూడా కలిగే అవకాశం ఉంది. సమయాన్ని సద్వినియోగం చేసుకోడం అంటే కాలంతో పాటు నడుస్తూ కర్తవ్యాన్ని నిర్వర్తించడమే. మనలో చాలామంది తీరిక దొరకడంలేదు, లేకపోతే ఎన్నో సాధించేవాడినని అంటూ ఉంటారు. ఈ అభిప్రాయం సరైనదికాదు. కాలం అందరికీ సమానమే. అది తెలుసుకొని పొదుపుగా వాడుకుంటే గొప్పవాళ్లు అవుతారు. లేకపోతే సామాన్యులుగానే మిగిలిపోతారు. ప్రపంచములో గొప్పవాళ్లయిన వ్యక్తుల చరిత్రలు పరిశీలించి చూడండి. వాళ్లందరూ ప్రతి నిమిషాన్ని పొదుపుగా వాడుకున్నవాళ్లే.

అందువల్లే శ్రీశంకరాచార్యులు, ఏసుక్రీస్తు, వివేకానందస్వామి మొదలైన మహాపురుషులు తమ స్వల్ప వయస్సులోనే శరీరాన్ని చాలించినప్పటికీ, ఉన్న సమయంలోనే ఎన్నో కార్యాలను సాధించగలిగారు. వీరిలో ఆధునిక కాలానికి చెందిన శ్రీవివేకానందస్వామి 39 సంవత్సరాల 5 మాసముల 14 రోజులలోనే తనువు చాలించినప్పటికీ ఎన్నో కార్యాలు సాధించిన కర్మయోగి. ఆయన మన యువతకు సందేశమిస్తూ "ఓ యువకులారా! భావిభారత నిర్మాతలు, నిర్ణేతలు మీరే. మీ ఆలోచనలను నిరాశావాదం నుంచి ఆశావాదం వైపునకు మళ్లించండి. ఇనుపకండరాలు ఉక్కునరాలు కలిగిన యువత మనకు కావాలి. యువజనులైన మీరు నిరీక్షణతో పొద్దుపుచ్చే దుస్థితిని విడనాడండి. కాలం విలువ తెలుసుకోండి. వట్టిమాటలతో కాలం వృధా చేయవద్దు." అన్నారు. దీన్ని బట్టి వివేకానందుని అభిప్రాయంలో సమయం విలువ ఎంత మహోన్నతమైనదో తెలుస్తోంది. సమయం సద్వినియోగం చేసుకోవడమంటే పొదుపుగా వాడుకోవడమేనని ఇంతకుముందే అనుకున్నాం. పొదుపు చేసే మార్గం గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

1) మన జీవితంలో సగభాగం నిద్రలోనే గడిచిపోతుంది. మనం సగటు ఎనిమిది నుండి పది గంటలకాలం నిద్రకి ఖర్చు చేస్తున్నాం. సాధారణంగా నిద్రకి ఆరుగంటల సమయం చాలు. ఈ విధంగా నాలుగుగంటల సమయం మనం ఆదా చేయవచ్చు. ఈ విధంగా నెల మొత్తం మీద 60 నుంచి 120 గంటలు ఆదా చేయగలుగుతాం. అలా చేస్తే నెలకి రెండున్నర నుంచి ఐదు రోజుల



కాలం అదనంగా లభించినట్లవుతుంది. కొంతమంది పగలు కూడా రెండుమూడు గంటలు పడుకుంటారు. వారు పగటి నిద్ర మానేస్తే కొంత సమయం ఆదా చేయవచ్చు. ఆ సమయం మరో మంచిపనికి ఖర్చు చేయవచ్చు. ఇక్కడ గమనించవలసిన మరో ముఖ్య విషయముంది. రాత్రి పన్నెండు గంటలకు ముందు తీసుకునే ఒక గంట విశ్రాంతి పన్నెండు గంటల తరువాత తీసుకునే రెండుగంటల విశ్రాంతితో సమానమని వైద్యశాస్త్ర నిపుణులు చెపుతున్నారు.

2) సమయం విలువను కాలరాచే మరొక జాడ్యం సోమరితనం. సాధారణంగా మనసు సుఖాన్ని, బుద్ధి హితాన్ని కోరుకుంటాయి. పరీక్షలొస్తున్నాయి. చదవడం మొదలుపెట్టమని బుద్ధి చెపుతుంది. ఏమీ ఫరవాలేదు బాగా దగ్గరకొచ్చాక చదవొచ్చని మనస్సు చెపుతుంది. మనం మనస్సు మాటే వింటాం. బుద్ధి చెప్పింది వినం. అందుకే ఈ అనర్థం. కాబట్టి ప్రతి వ్యక్తి మనస్సును అదుపులో ఉంచుకుంటే సోమరితనాన్ని జయించొచ్చు.

3) దినచర్యను ప్రణాళికాబద్ధంగా వ్రాసుకోవడం ద్వారా సమయం ఆదా చేయవచ్చు. తక్కువ సమయంలో ఎక్కువ పనులు పూర్తి చేసుకోవచ్చు. ఉదాహరణకి ఒక చోటికి వెళ్లేటప్పుడు అక్కడ చేయవలసిన పనులన్నీ ఒక కాగితం మీద వ్రాసుకొని ఉంచుకుంటే అన్నీ ఒక్కసారే పూర్తిచేసుకోవచ్చు.

4) నేటి యువత విజ్ఞానం కన్నా వినోదానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నట్టు కనిపిస్తోంది. వినోదం జీవితంలో ఒక భాగం కావచ్చు గాని వినోదమే జీవితం కాకూడదు. కాని నేటి యువత వినోదాన్నే విజ్ఞానంగా భావిస్తున్నారు. వీటికి తోడు ప్రైవేటు టివి ఛానళ్లు కూడా వినోదానికి విజ్ఞానమనే రంగు పులిమి యువతీయువకుల అమూల్యమైన కాలాన్ని హరిస్తున్నాయి. ఉదాహరణకు ఒక గొప్ప వ్యక్తి బొమ్మ చూపించి అతని పేరు, వివరాలు ప్రశ్నించి విజేతలకు బహుమతులు ఇవ్వడంలో తప్పేమీలేదు. అలా కాకుండా సినిమాల్లో నటించే కొంతమంది నాయకీ నాయకుల పేర్లు చెప్పి వారు నటించిన మొదటి చిత్రం చెప్పమని కోరుతూ ఆకర్షణీయమైన బహుమతులు ఎర చూపిస్తే అది యువత అమూల్యమైన కాలాన్ని హరించడమే అవుతుంది. కాబట్టి నేటి యువత వివేకంతో దేనికెంత సమయాన్ని కేటాయించాలో తెలుసుకొని తగిన విధంగా ప్రవర్తిస్తే ప్రగతి సాధించగలం.

5) విద్యార్థులు పాఠ్యాంశాలను క్రమబద్ధంగా చదవడం వలన కూడా సమయాన్ని ఆదా చేసుకోవచ్చు. పరీక్షలొచ్చే వరకు పుస్తకాలు తీయకుండా అవి దగ్గరకొచ్చాక విశ్రాంతి లేకుండా



చదివి చదివి పరీక్షల్లో కళ్లు తిరిగి పడిపోయి భవిష్యత్తు నాశనం చేసుకున్న వాళ్ళెంతమందో ఉన్నారు. అందువల్ల విద్యార్థులు ముందునుంచే సమయం విలువ గుర్తించాలి.

6)మనలో కొంతమంది ఇతరులతో మాట్లాడేటప్పుడు ఎంతసేపు మాట్లాడాలో గమనించరు. ఎదుటివారి ఇబ్బందులు అసలు పట్టించుకోరు. ఒకాయన మరొక వ్యక్తిని సుమారు రెండుగంటల సేపు వాయించాక 'అయ్యా! మీతో మాట్లాడాక నాకు తలనొప్పి పోయిందండి' అన్నాడు. రెండో ఆయన దానికి సమాధానంగా 'అయ్యా! ఎక్కడికీ పోలేదు అది నాకు చుట్టుకుంది' అన్నాడు. పరేంగితావగాహి జ్ఞానమే పాండిత్యం అన్నారు పెద్దలు. ఇతరుల మనోభిప్రాయం తెలుసుకుని తదనుగుణంగా నడుచుకోవడమే పాండిత్యం గాని కేవలం శాస్త్రాలు బట్టీ పట్టడం కాదు.

7) ధ్యానం, యోగాభ్యాసం ఏకాగ్రతను పెంచుతాయి కాబట్టి వాటి ద్వారా తక్కువ సమయంలోనే ఎక్కువ జ్ఞానాన్ని, ఎక్కువ పనులు సాధించే సామర్థ్యాన్ని పొందవచ్చు.

8) రేపు చెయ్యవలసిన పని ఈరోజు, నేడు చెయ్యవలసిన పని ఇప్పుడు చెయ్యమని పెద్దలు చెబుతున్నారు. అలా చేస్తే సమయం ఆదా అవుతుంది. అలాగే మనం చేసుకోగల చిన్న చిన్న పనులకు కూడా ఇతరులపై ఆధారపడి వాళ్లకోసం ఎదురుచూడడం మంచిదికాదు. అలాగే ఏ పనైనా మొదలుపెట్టి చేస్తోంటే పూర్తవుతుంది గాని ఆలోచిస్తూ కూర్చుంటే ఎప్పటికీ పూర్తికాదు. నడక ప్రారంభిస్తే చీమ కూడా కొంతకాలానికి చేరవలసిన గమ్యం చేరుకుంటుంది. నడవకపోతే వేగంగా వెళ్లే గరుత్మంతుడు కూడా ఒక్కడుగు ముందుకెయ్యలేడు. అందువల్ల ఆలోచన కన్నా ఆచరణ మిన్న. సమయం విలువ బాగా తెలిసింది కాబట్టే మన భారతీయ సంస్కృతి శుభకార్యాలకు ఒక ముహూర్తాన్ని నిర్ణయించి కాలయాపనకు తావు లేకుండా చేసింది.

ఇంతవరకు సమయం విలువ, ఆ సమయాన్ని పొదుపు చేసే విధానం గురించి కొంచెం తెలుసుకున్నాం. ఇంతకంటే ఎక్కువ చెప్పడం మీ కాలాన్ని హరించడమే అవుతుంది. సమయాన్ని సద్వినియోగం చేసుకుందాం. సమాజ ప్రగతికి బాటలు వేద్దాం.సమయం విలువ తెలియచేసే ఒక చక్కని కవితతో నా వ్యాసం ముగిస్తాను. రచయిత పేరు మీకు తెలియచెయ్యలేకపోతున్నందుకు చింతిస్తున్నాను.



ఒక సంవత్సరం ఎంత విలువైనదో పరీక్షలో తప్పిన విద్యార్థినడుగు
ఒకరోజు ఎంత విలువైనదో ఒకటో తేదీన జీతం రాని వాణ్ణడుగు
ఒక గంట ఎంత విలువైనదో క్షణమొక యుగంగా గడిపిన ప్రేమికుడినడుగు
ఒక నిముషం ఎంత విలువైనదో రైలు మిస్సయిన ప్రయాణికుడినడుగు
ఒక సెకను ఎంత విలువైనదో యాక్సిడెంట్‌లో ప్రాణాలు దక్కిన వాణ్ణడుగు.

సేకరణ : గురుకృప

## పోనీలెండి సార్

ఒకరి కష్టాన్ని ఇంకొకరు ఉంచుకోకూడదు. కష్టపడువాని కూలీ సరిగాను, దాతృత్వంతోను, ధారాళముగా ఇవ్వవలెను. – శ్రీసాయిబాబా

హోమియో క్లాసులు జరుగుతున్నాయి. సన్నిహితులొకరు అక్కడికి మరీ దూరంకాని తమ ఊరి నుండి బయలుదేరి బస్సు దిగి మాస్టరుగారు ఉండే చోటికి రిక్షా ఎక్కారు. రిక్షా అతనికి ఆ చోటు వెదికి పట్టుకొని దించడానికి కొంచెం టైమ్ పట్టింది. రిక్షా ఆగేటప్పటికి మాస్టరుగారు అక్కడే నిలబడి నలుగురితో మాట్లాడుతున్నారు. తరగతికి తరగతికి మధ్య విశ్రాంతి సమయం అది. రిక్షా దిగిన పెద్దాయన్ని పట్టుకొని “మరో పావలా ఇప్పించండీ!” అన్నాడు రిక్షా అతను. “అన్నంతా ఇచ్చాగా” అన్నారు ఆ పెద్దాయన. “మీరే చూస్తున్నారుగా బాబూ! టైమెంత లాగిందో, ఒక పావలా ఇప్పించండి.‘టీ’ కి ఉంటుంది. పోనీలే ఇద్దామని జేబులో చేతిని పెడుతున్న ఆ పెద్దాయన్ని చూస్తూ చిరునవ్వుతో మాస్టరుగారు ఇచ్చి పంపండని సైగ చేసారు.

ఇచ్చి పంపి చేరువవుతున్న పెద్దాయన్ని చూపులతో ఆదరంగా ఆహ్వానిస్తూ “పోనీలెండి సార్! తీసుకుంటే తీసుకున్నాడు పాపం! నలుగురి బరువు వాడొక్కడే లాగాడు కదా!” అన్నారు మాస్టరుగారు. ఒక్క క్షణం ఎవరికీ ఏమీ అందలేదు. ఇంతలో ఆ పెద్దాయన మనస్సులో ఏదో వెలిగినట్లయింది. “బలే కొట్టారు సార్ దెబ్బ. నలుగురి పని వాడొక్కడే చేశాడంటారా!” అంటూ మళ్ళీ మళ్ళీ తలచుకొని నవ్వసాగాడాయన. ఇంతలో ఒకరి నుండి ఒకరికి అందసాగింది. అసలు రహస్యం. ఆ రహస్యంలోని అంతరార్థం. ఇంకేముంది, అందరూ ఒకటే నవ్వు! ఎవరికి వారు నవ్వుతూనే మధ్యలో తమని తాము మనస్సులో తడిమి చూసుకుంటున్నారు.

మాస్టరుగారు అర్థవంతంగా అందరివైపు చూస్తూ లోపలికి దారితీసారు. అందరూ ఆయన్ని అనుసరిస్తున్నారు. చివరకు మిగిలిన ఒకతను తన ముందు నడుస్తున్న మిత్రుడ్ని వెనక్కిలాగి చెవులో ఏదో అడిగాడు. “ఓరీ! నీకర్థం కాలేదా! మరి అర్థమయినట్లు నవ్వేసావ్! ఏంలేదు మాస్టరుగారు వేసిన జోకు సీమటపాకాయలాంటిది. పేలినపుడుగాని దాని సత్తా తెలియదు. మనిషి పోయినపుడు ఎందరు మోస్తారు..”



అని అడిగాడు మిత్రుడు. "నలుగురు" అన్నాడు. "ఇప్పుడు నీవు బ్రతికి ఉన్నావు కాబట్టి ఆ నలుగురి బరువు ఇతనొక్కడే లాక్కొచ్చాడు. నలుగురి పని ఒక్కడే చేసాడు గదా! పోనీలే ఇంకో పావలా ఇస్తే ఏం పోయింది అన్నారు. అర్ధమయిందా!" అడిగినతనికి ఇక నవ్వాగలేదు. అతనికప్పుడు సీమటపాకాయ పేలినట్లయింది. క్లాసులో మాస్టరుగారు ఇవేమీ పట్టనట్లు నిలబడి చాక్‌పీస్‌తో ఏవో పాయింట్లు బోర్డుమీద గబగబా వ్రాస్తున్నారు.

**–సరసాల్లో నవరసాలు**

## సమన్వయం

ఓ జిజ్ఞాసువు గురువు చెంతకు చేరి, "పురుషార్ధాలు అంటే ధర్మార్ధ కామ మోక్షాలు కదా!! ధర్మ, అర్ధ, కామాలు అంటే నాకు కొంతలో కొంత అర్ధం అయింది. సార్, నాలుగవది అయిన మోక్షం అంటే అర్ధం అవడం లేదు" అంటాడు.  ఒక్కక్షణం ప్రసన్నంగా ఆయనవైపు చూసారు గురువుగారు. "చక్కటి ప్రశ్న. ఏది మీ ప్రక్కన ఆ మూలనున్న కఱ్ఱపుల్లను అందుకోండి".

ఇప్పుడదెందుకో అనుకుంటూనే గురువుగారి ఆజ్ఞకదా మరి! ఆ కఱ్ఱ అందుకున్నాడాయన. "ఆ కఱ్ఱ పుల్లను నాలుగు ముక్కలయ్యేట్లు విరవండి" అన్నారు గురువుగారు. ఆశ్చర్యంగా చూస్తూనే ఆయన విరిచాడు. "ఎన్ని ముక్కలు చేసారు?" "నాలుగు" అన్నాడాయన. "ఎన్నిసార్లు విరిచారు?" అడిగారు గురువుగారు. "మూడుసార్లు" అన్నాడాయన గురువుగారి కళ్ళలోకి చూస్తూ. "అంటే నిజానికి మీరు చేసింది మూడు ముక్కలే. నాలగవ ముక్క దానికది ఏర్పడింది కదా!" ఆశ్చర్యంగా చూస్తున్నాడాయన. చూస్తూనే "నిజమేనండి" అన్నాడు.

"అసలున్న నిజమే అది. కఱ్ఱపుల్లను మూడుసార్లు విరిస్తే నాలగవముక్క దానికదిగానే ఏర్పడినట్టు పురుషార్ధాల్లో మొదటి మూడింటిని సరైన పద్ధతిలో నిర్వహించుకుంటే నాలుగవది దానికదిగానే అనుభవానికి వస్తుంది. ధర్మార్ధ కామాలను జీవితంలో సమన్వయించుకోవడం చేతనైన వాడికి మోక్షస్థితి దానికదిగానే సిద్ధిస్తుంది.

"ఎంత సులువుగా, ఎంత తేలికగా చెప్పారు గురువుగారు. ఈరోజు నిజంగా నా జీవితంలో పర్వదినం" అంటూ గురువుగారి పాదాలపై వ్రాలిపోయాడాయన పారవశ్యంతో. ప్రేమతో ఆయన్ను లేవనెత్తుతూ "ఏమీ అక్కర్లేదు. జీవితాన్ని సీరియస్‌గా కాకుండా .... చూడగలగాలి. అప్పుడు జీవించడమే ఉంటుందిగాని, జీవితాన్ని గురించి ఆలోచించడం ఉండదు. సమన్వయమే ఉంటుందిగానీ సందేహానికి తావుండదు" అంటూ ప్రేమ కురిసే కళ్ళతో జిజ్ఞాసువువైపు చూసారు గురువుగారు. ఆ చూపులు చాలు జన్మజన్మలకు అదే మాకు దారి చూపగలదు.

**సేకరణ : గురుకృప**



మంచి నిద్రపోయి ఠక్కున లేచాము. ఫస్ట్ మనకు జ్ఞాపకం వచ్చేటటువంటిది మనమెవరు అనేటువంటిది. మన పేరు. That is the basic identity. మన ఐడెంటిటీ కార్డు ఉందనుకోండి..మన ఐడెంటిటీ కార్డులో ప్రామినెంట్‌గా ఉండేది మన పేరు. ఆ తరువాత మిగతా డిటెయిల్స్ ఉంటాయి. అందుకనే వ్రాసింది నేను. **తన్మయత్వపు తావు నుండే పేరు మరచిన ప్రేమతత్త్వం.** ఆ పేరు కూడా మరచిపోగలగాలి.

మంచి డీప్ నిద్రలో ఉండేవాడిని లేపామనుకో, కొన్ని సెకన్స్ పడుతుంది, మనమెవరో మనకు తెలియడానికి, మనం తెలిసేటప్పటికి ప్రపంచం తెలుస్తుంది. అది ద్రిగ్భ్రాంతితో కూడినటువంటి తెలియనితనం. అదే ప్రేమతో ఉండేటటువంటి తన్మయత్వం గాని వచ్చినట్లయితే, అక్కడ బాబా ఉంటారు. అది సాధించడానికే ఈ ప్రయత్నం అంతా కూడాను.

ఆ తన్మయత్వపుస్థితి, అది ఉంటే, మన జీవితం ఆనందజీవనం సాయిపథము అవుతుంది. ఆనందం ఉంటుంది, రక్షణ ఉంటుంది. ఇంకా దేనికీ ఆలోచించాల్సిన అవసరంలేదు. ఆ తన్మయత్వపు తావుకు చేరాలంటే పోగొట్టుకోవలసింది ముందు ఇది. అది పోగొట్టుకొనేదానికి ఈ సత్సంగాలు దోహదం చేయాలి. **-శ్రీబాబూజీ**

నా వారు అనుకున్నవారు, నా పద్ధతులు నచ్చినవారు
నా మార్గాన్ని అనుసరిస్తారు, నా పద్ధతుల్ని పాటిస్తారు.

- శ్రీబాబూజీ

## పదమార్గము

సద్గురు పాదములపై పడువారు మెండు. ఆ పాదములు
నడుచు మార్గమున నడుచువారు కొందరే.
పాదములపై పడుటకన్నా ఆ పాదముల జాడలను
అనుసరించుట శ్రేష్టమైన పని.
పాదముల ననుసరించి నడుచువారు
తధాగతులై సత్యమును చేరిరి. కేవలము
నమస్కరించువారు అచటనే
యుండిపోయిరి. పాద నమస్కారమునకు
ప్రయోజనము అనుసరణమే. అనుసరణ లేని
నమస్కారములు ఒక ఆచారముగ
మిగిలిపోయి యున్నవి. మార్గమున నడచు బాధ్యతను
స్వీకరించుట వలన నమస్కారమునకు
ప్రయోజనముండును. సద్గురువు
ననుసరించుటలో సమస్తము పరిష్కరింపబడి
తారణ స్థితి లభించును.

- మైత్రేయ మహర్షి

